RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్
నెంబర్: 99637 08331

| Malkajgiri | Volume: 4 Issue: 21 | Thursday, June 11, 2026 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/- |
|---|---|---|---|---|---|
| మల్కాజిగిరి | సంపుటి: 4 సంచిక: 21 | గురువారం, జూన్ 11, 2026 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /- |

## చారిత్రాత్మక మైలురాయిని అధిగమించిన మోడీ

**-12 ఏళ్ల పాలనపై కేంద్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానం- 4,399 రోజులు పూర్తి.. ఎన్నికైన ప్రధానిగా మోడీ కొత్త చరిత్ర- 12 ఏళ్ల పాలనపై కేంద్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానం- పేదల సంక్షేమం నుంచి చంద్రయాన్ వరకు విజయాల ప్రస్తావన- 'వికసిత్ భారత్ 2047' లక్ష్యంపై కేబినెట్ పూర్తి విశ్వాసం**

**హైదరాబాద్,జూన్, 10:** భారతదేశ రాజకీయ చరిత్రలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక అరుదైన చారిత్రాత్మక మైలురాయిని అధిగమించారు. దేశంలో అత్యధిక కాలం పాటు నిరంతరాయంగా సేవలు అందించిన 'ఎన్నికైన' ప్రధానమంత్రిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్న నరేంద్ర మోడీ, దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న సుదీర్ఘ కాల పరిమితి రికార్డును దాటేశారు. మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం విజయవంతంగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రివర్గం (కేబినెట్) ప్రత్యేకంగా సమావేశమై ప్రధానికి ఘనంగా అభినందనలు తెలిపింది. దేశ ప్రజలు ఆయనపై ఉంచిన అపారమైన విశ్వాసానికి, ఆశీర్వాదాలకే ఈ ఘనత నిదర్శనమని కేబినెట్ కొనియాడింది. తనను తాను "ప్రధాన సేవక్"గా భావిస్తూ దేశ సేవకే అంకితమైన మోడీ నాయకత్వంలో భారతదేశం సరికొత్త పుంతలు తొక్కిందని కేంద్ర మంత్రులు ప్రశంసించారు.



గడిచిన 12 ఏళ్ల పాలనలో పేదల సంక్షేమాన్నే కేంద్రబిందువుగా చేసుకుని మోడీ ప్రభుత్వం ముందుకు సాగిందని కేంద్ర కేబినెట్ ఈ సందర్భంగా గుర్తుచేసింది. దేశంలోని కోట్లాది మంది పేదలకు పక్కా ఇళ్లు, విద్యుత్, గ్యాస్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలను కల్పించడమే కాకుండా 80 కోట్ల మందికి ఉచిత రేషన్, 60 కోట్ల మందికి ఆరోగ్య భద్రతను కల్పించినట్లు పేర్కొంది. ఫలితంగానే దేశంలో 25 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడే అవకాశం లభించిందని తెలిపింది. వీటితో పాటు యువత, స్టార్టప్‌లు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వం అపూర్వమైన ప్రోత్సాహాన్ని అందించిందని, చంద్రయాన్ విజయంతో భారత శాస్త్ర సాంకేతిక సామర్థ్యం ప్రపంచ వేదికపై మెరిసిందని కేబినెట్ కొనియాడింది. మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూనే, రైతుల సంక్షేమం కోసం పీఎం కిసాన్ నిధి, మద్దతు ధరల పెంపు, సాగునీటి ప్రాజెక్టులకు మోడీ ప్రభుత్వం ఎంతో ఊతాన్ని ఇచ్చిందని స్పష్టం చేసింది.


## 2047 వరకు మోదీయే ప్రధానిగా కొనసాగాలి : బండి



**హైదరాబాద్,జూన్, 10:** భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కొనియాడారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన అరుదైన రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని హర్షం వ్యక్తం చేశారు. "రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. ఆయన తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను 'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## పీవోకేలో కూలిన పాక్ హెలికాప్టర్ - 21 మంది సైనికులు మృతి

**న్యూఢిల్లీ,జూన్,10:** దాయాది దేశం పాకిస్థాన్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ ఆర్మీ ఏవియేషన్‌కు చెందిన ఎంఐ-17 హెలికాప్టర్ ముజఫరాబాద్ సమీపంలో టేకాఫ్ అవుతున్న సమయంలో కూలిపోయింది. సాంకేతిక లోపం కారణంగా కూలిపోయింది. హెలికాప్టర్‌లో ఉన్న సిబ్బంది అందరూ అమరులయ్యారని పాకిస్థాన్ మీడియా తెలిపింది. ఈ ఘటనలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (×ఞూా=)ను ఉటంకిస్తూ పాకిస్థాన్ డాన్ పత్రిక వెల్లడించింది. హెలికాప్టర్‌లో 21 మంది సైనికులు ఉన్నట్లుగా తెలుస్తోంది. అందరూ చనిపోయినట్లుగా సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని అధికారులు వెల్లడించారు. హెలికాప్టర్‌లో ఉన్న సైనిక సిబ్బంది దేశ సేవలో అమరులయ్యారని పాకిస్థాన్ సైన్యం పేర్కొంది. ఈ ప్రమాదానికి



గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు పాకిస్థాన్ ఆర్మీ దర్యాప్తు ప్రారంభించింది. సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ.. పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ముజఫరాబాద్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటన పాకిస్థాన్ సైనిక వర్గాల్లో విషాదాన్ని నింపింది.

### తెలంగాణలో పొత్తులపై

## అమిత్ షా స్పష్టమైన ప్రకటన

**హైదరాబాద్,జూన్, 10:** రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ (దీజీూ) వ్యూహంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా అత్యంత కీలకమైన ప్రకటన చేశారు. తెలంగాణలో ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకునే ప్రసక్తే లేదని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని ఆయన స్పష్టం చేశారు. సొంత బలంతోనే ఎన్నికల్లో పోటీ చేసి, రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకోవడమే తమ ఏకైక లక్ష్యమని అమిత్ షా వివరించారు. రాష్ట్రంలో పొత్తులపై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, తెలంగాణ ఎన్నికల బరిలో బీజేపీ ఒంటరిగానే నిలుస్తుందని హోం మంత్రి తేల్చి చెప్పారు. పంజాబ్ వంటి రాష్ట్రాల్లో కూడా తాము ఇదే విధమైన వ్యూహంతో ముందుకు వెళ్తున్నామని ఆయన ఉదహరించారు. గతంలో ఇతర పార్టీలకు అవకాశాలు ఇచ్చిన ప్రజలు, ఇప్పుడు మార్పును కోరుకుంటున్నారని.. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని నమ్ముకుని ఒంటరి గానే విజయం సాధిస్తామనే ధీమాను వ్యక్తం చేశారు.



## ఈగల్ ఫోర్స్ బిగ్ ఆపరేషన్

### కిరాణాషాపు ముసుగులో గంజాయిదందా గుట్టురట్టు

**హైదరాబాద్,జూన్, 10:** నగర పరిధిలోని ఐటీ కారిడార్‌లో డ్రగ్స్, గంజాయి మహమ్మారిపై ఉక్కుపాదం మోపుతున్న ఈగల్ ఫోర్స్‌ఇవాళ ఓ భారీ ఆపరేషన్ నిర్వహించింది. నగరంలోని ప్రముఖ ఐటీ హబ్ అయిన నానక్‌రామ్‌గూడ పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సాగుతున్న గంజాయి నెట్‌వర్క్‌ను టార్గెట్ చేస్తూ అధికారులు మెరుపు దాడులు చేశారు. ఈ దాడిలో కిరాణా షాప్ ముసుగులో సాగుతున్న రూ.కోట్ల గంజాయి దందా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. నానక్‌రామ్ గూడ ఐటీ కోర్ ఏరియాలో నివాసం ఉండే ప్రముఖ డ్రగ్స్ వ్యాపారి నీతూ భాయ్ ఓ కిరాణా దుకాణం నడుపుతున్నాడు.

అయితే, ఈ షాప్ ముసుగులో అతను పెద్ద ఎత్తున గంజాయి, డ్రగ్స్ విక్రయాలు సాగిస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ నిఘా విభాగం పక్కా సమాచారం సేకరించింది. కేవలం గంజాయి అమ్మకాల ద్వారానే నీతూభాయ్ రోజుకు రూ. 5 లక్షల నుండి రూ.10 లక్షల వరకు సంపాదిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఐటీ కారిడార్‌లోని




లండన్, యూఎస్ క్లయింట్లతో పనిచేసే నైట్ షిఫ్ట్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే లక్ష్యంగా ఈ దందా సాగుతోంది. గంజాయి కోసం నిత్యం ఐటీ ఉద్యోగులు ఇతని ఇంటి ముందు క్యూ కడుతుంటారు.

## మోదీ మైలురాయి.. ఆలయంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రత్యేక పూజలు

**న్యూఢిల్లీ,జూన్,10:** జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్నరికార్డును అధిగమించిన ప్రధాని ఈ సందర్భంగా ఆలయంలో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ప్రత్యేక పూజలు ప్రపంచ సవాళ్ల మధ్య దేశానికి స్థిరమైన నాయకత్వం లభించిందని వ్యాఖ్య ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అరుదైన రాజకీయ మైలురాయిని చేరుకున్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానిగా అత్యధిక కాలం పదవిలో కొనసాగిన నేతగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ క్రమంలో స్వతంత్ర భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపేరిట ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. ఈ చరిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఢిల్లీలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



2014 మే 26న తొలిసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోదీ, 2026 జూన్ 10 నాటికి ఎన్నికైన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. గతంలో ఈ రికార్డు జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉండేది. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల నుంచి 1964 మే 27 వరకు నెహ్రూ 4,398 రోజుల పాటు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానిగా బాధ్యతలు నిర్వహించారు. 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు విజయం సాధించడం ద్వారా మోదీ ఈ విశిష్ట ఘనతను సొంతం చేసుకున్నారు.

### నేడు ఖర్గే సారథ్యంలో..

## ఏఐసీసీ అత్యవసర సమావేశం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన ఏఐసీసీ అత్యవసరంగా సమావేశమవుతోంది. జూన్ 11న ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఉదయం 11.30 గంటలకు ఈ సమావేశం జరుగనుంది. పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులు, పీసీసీ అధ్యక్షులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఏఐసీసీ అత్యవసర సమావేశం ప్రధాన ఎజెండా ఏమిటనేది పార్టీ అధిష్ఠానం ఆ సర్క్యులర్‌లో పేర్కొనలేదు. అయితే మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ్య నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తోసిపుచ్చిన అంశం ప్రధానంగా ఈ సమావేశంలో చర్చకు రానుందని, దీనికి సంబంధించి భవిష్యత్ కార్యచరణపై సమావేశంలో చర్చించనున్నారని తెలుస్తోంది. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడంతో కాంగ్రెస్ ప్రతినిధి బృందం ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు బుధవారంనాడు కలిసి ఫిర్యాదు చేసింది.



తక్షణం చర్యలు తీసుకోవాలని కోరింది. ఇది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యని ఆరోపించింది. దీనిపై న్యాయపోరాటానికి కూడా కాంగ్రెస్ సిద్ధమవుతోంది. మరోవైపు మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో రాజ్యసభ ఎన్నికల్లో మూడో అభ్యర్థిగా నిలబెట్టిన మహేశ్ కావత్ విజయంపై బీజేపీ ధీమాగా ఉంది.

### మల్కాజ్‌గిరిలో దారుణం..

## భార్యను కాల్చిచంపిన భర్త..

హైదరాబాద్, జూన్ 10: నగరంలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. అనుమానం నేపథ్యంలో ఓభర్త తన భార్యను తుపాకితో కాల్చి చంపాడు. మాట్లాడుకుందాం అని పిలిచి ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మల్కాజ్‌గిరికి చెందిన అరుణ్ అనే వ్యక్తికి పదేళ్ల క్రితం ఓ మహిళతో పెళ్లైంది. వివాహం అనంతరం భార్యతో విభేదాలు తలెత్తాయి. అరుణ్ వేధింపులు తట్టుకోలేక ఆమె దూరంగా ఉంటోంది. ఈనేపథ్యంలో భార్య చెల్లెలు ఉషారాణితో అరుణ్ సహజీవనం మొదలుపెట్టాడు. ఐదు సంవత్సరాల క్రితం యాదగిరిగుట్టలో ఉషారాణిని వివాహం చేసుకున్నాడు. అరుణ్, ఉషారాణి మల్కాజ్‌గిరిలోని మారుతి నగర్‌లో ఇళ్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. ఉషారాణి మరొకరితో సన్నిహితంగా ఉంటోందని, చాటింగ్ చేస్తోందని అరుణ్ అనుమానం పెంచుకున్నాడు.




ఈనేపథ్యంలోనే ఇద్దరి మధ్య గత కొన్ని నెలల నుంచి గొడవలు జరుగుతున్నాయి. గొడవల కారణంగా ఉషారాణి భర్తకు దూరంగా ఉంటోంది. దీంతో భార్య మీద పగ పెంచుకున్న అరుణ్ ఆమెను చంపాలని నిశ్చయించుకున్నాడు. ఉషారాణిని మాట్లాడుకుందాం అని పిలిచి తుపాకితో కాల్చాడు. బుల్లెట్ల కారణంగా తీవ్రంగా గాయపడ్డ ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.

తెలంగాణ షాన్

## సంపాదకీయం

# తెలుగునేలపై శైవమత వ్యాప్తి.....

చారిత్రక యుగమున శాతవాహన, చాళుక్య, రాష్ట్రకూట, కాకతీయ, అనంతర కాలమున హైందవ సంస్కృతీ సభ్యతలకు ఆలవాలమైన తెలుగు నేలలో వివిధ రాజన్యుల ఏలుబడులలో శైవమతం పరిడవిల్లింది. క్రీ.పూ. 2వ శతాబ్ది నాటికే తెలుగు నేలలో శైవారాధన ఉంది. గాథా సప్తశతిలో గౌరీ, పశుపతి స్తోత్రముంది. 1వ శతాబ్దంలో శైవంలో అత్యంత ప్రాచీనమైన పాశుపత శైవాన్ని లకులీస శివాచార్యుడు స్థాపించారు. చేతికందుతున్న చరిత్ర ఆధారంగా శ్రీముకుడు కాణ్వ రాజైన సుశర్మను వధించి, మగధను ఆక్రమించి, శాతవాహన రాజ్యాన్ని స్థాపించాడని, వివిధ చరిత్రకారుల అభిప్రాయాన్ని అనుసరించి, శ్రీ.పూ. 1వ శతాబ్దిగా స్పష్టమవుతున్నది. శ్రీముకుడు జైన మతాన్ని స్వీకరించి, అనేక ఆలయాలను నిర్మించాడు. శాతవాహన 17వ రాజైన హాల చక్రవర్తి, సింహళ రాకుమారి లీలావతిని సప్త గోదావరీ తీరస్థ భీమేశ్వరాలయం, నేటి జగిత్యాల జిల్లాలోని వేంపెల్లి వెంకటరావుపేటలో వివాహ మాడినట్టు నాటి భీమేశ్వరాలయం ఉన్నట్లు నిరూపితమైంది. బౌద్ధమతంలోనూ నాగదేవత అరాధన ఉంది. స్థూపాలను పెనవేసుకున్న నాగ సర్పాల చిత్రాలు ప్రధానంగా ధూళికట్ట స్థూపంపై ఐదుతలల నాగ ముచిలింద శిల్పాన్ని చూడవచ్చు. ఇక్ష్వాకు (క్రీ.శ.253, 277) రాజైన ఎహువల శాంతమూలుని సేనానియైన ఎలిశ్రీ ఏలేశ్వరం నిర్మించి, సర్వదేవాలయమనే శివాలయాన్ని నిర్మించాడు. ఆయన కాలంలో విజయపురిలో కార్తికేయ, పుష్పభద్ర స్వామి, నోడిగిరీశ్వర, దేవీ ఆలయాలు నిర్మితాలై నాయి. ఇక్ష్వాకుల కాలంలో మాతృ దేవతారాధన కూడా ఉండేది. నాగార్జున కొండలో హరీతి ఆలయం నిర్మించ బడింది. ఆలయంలో సప్తమాతృకల వద్ద గాజులను సమర్పించే వారని శాసనాధారం. వీరికాలంలో స్కంద గణపతి, యక్షుడు, హరీతి దేవత లను పూజించేవారు. అనంతర వాకాట రాజులలో అధికులు శైవులు. మొదటి రుద్ర సేనుడు మహా భైరవుని భక్తుడు కాగా, మొదటి పృధ్వీసేనుడు మహేశ్వర భక్తుడు. క్రీ.శ.358నుండి 569వరకు 210 ఏళ్ళు తెలంగాణను, ఉత్తరాంధ్రను పాలించిన విష్ణుకుండినులు నేటి మహబూబ్ నగర్ జిల్లాలోని అమ్రాబాద్ (అమల పురం), నల్గొండ జిల్లాలోని వలిగొండ మండలం లోని ఇంద్రపాల నగరం. కొంతకాలం బెజవాడను రాజధానిని చేసుకున్నారు. వీరు బ్రాహ్మణ మతావ లంబులు, శివభక్తులు. రెండవ మాధవవర్మ (క్రీ.శ.440–495) 100కుపైగా యుద్ధాలు చేసి, విజయాలు సాధించి, ఒక్కొక్క విజయానికి గుర్తుగా కీసర గుట్టపైన ఒక లింగ ప్రతిష్ఠ చేశాడు. విజయం సాధించిన చోటల్లా రామలింగేశ్వర ఆలయం కట్టించాడు. శ్రీశైలం మల్లికార్జునునికి చంద్రగుప్తుడు అనే రాజు బంధువైన చంద్రవతి ప్రతి ష్ఠించినదని చెపుతున్న గుప్త మహేశ్వర ఆలయ శిథిలాలు, నేటికీ శ్రీశైల ఉత్తర ద్వార క్షేత్రమైన ఉమా మహేశ్వరానికి ఉత్తరాన ప్రతాప రుద్ర కోటకింద వాయవ్య మూలన రోడుకు దక్షిణాన ఉన్నాయి. శ్రీశైల మల్లికార్జునుడు విష్ణుకుండినుల కాలంలోనే బహుళ ప్రచారం పొందాడు. గోవింద వర్మ అనేక దేవాలయాలు కట్టించాడు. 2వ మాధవ వర్మ అనేక రామ లింగేశ్వరాలయాలు కట్టించాడు. గుంటూరు జిల్లా లోని సత్తెనపల్లి తాలూకా వేల్పూరులో, ఈ ఊరులో, కీసరగుట్టలో రామలింగే శ్వరాలయాలు నేటికీ దర్శనీయ స్థలాలే. తూర్పు చాళుక్య 2వ విజయాదిత్యుడు 108 విజయాలకు గుర్తుగా 108 భీమేశ్వరాలయాలు నిర్మించాడు. జైన మతం విష్ణుకుండినుల కాలంలోనే దాదాపు కనుమరుగు కాగా, జైన ఆలయాలు శివాలయాలైనాయి. అలంపురం విష్ణుకుండినుల కన్నా ముందువారైన ఇక్ష్వాకుల నుంచే మనుగడలో ఉండేదని శాసనాధా రంగా ఉంది. వేములవాడ చాళుక్యులు, వేములవాడలో నిర్మించిన రాజరాజేశ్వరాలయం తెలంగాణ లోని ప్రముఖ శివాలయం. బద్దెగ (క్రీ.శ.850–895) వేములవాడలో బద్దిగేశ్వర (భీమేశ్వర) ఆలయాన్ని నిర్మించాడు. క్రీ.శ.7వ శతాబ్ది శాసనంలో శివమండల దీక్ష ప్రసక్తి ఉంది. శ్రీశైలం, అలంపురం, బెజవాడ, పిఠాపురం నాటి శక్తి పూజా కేంద్రాలు. బసవేశ్వరుడు (క్రీ.1100–70) వీర శైవోద్యమాన్ని ప్రారంభించాడు. అనంతరం మల్లికార్జున పండితుడు శైవాన్ని ప్రచారం చేశాడు. చాళుక్య భీముడు ద్రాక్షారామంలో భీమేశ్వరాలయం నిర్మించాడు. భీమవరం, పాలకొల్లు, అమరావతి ఆలయాలు చాళుక్య నిర్మాణాలే. యుద్ధ మల్లుడు బెజవాడలో కుమారస్వామి, 2వ విక్రమాదిత్యుని భార్య మహాదేవి, పట్టడకల్ లో శైవాలయాన్ని నిర్మించారు. రాష్ట్రకూటుల కాలంలో ఎల్లోరా గుహలు మలుచ బడ్డాయి. కైలాసనాథ ఏక శిలాలయం మొదటి కృష్ణుని అద్భుత సృష్టి. కాలాముఖి, కాపాలిక తెగలు ప్రచారం లోకి వచ్చాయి. కాకతీయులు కాకతి మాతృదేవతారాధకులుగా అభిప్రాయాలున్నాయి. గ్రామదేవత యైన ఏకవీర ఆరాధన నాడు బహుళ ప్రచారంలో ఉంది. వీరికాలంలో జైన బౌద్ధ, వీరశైవుల మధ్య ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇందుకు భిన్నంగానే తిక్కన హరిహర తత్వాన్ని బోధించాడు. కాళేశ్వరంలో శివలింగ ప్రతిష్ఠ చేసింది 2వ ప్రోలరాజు గురువైన రామేశ్వర పండితుడు. కాకతీయ పరిపాలనలో ధర్మపురి, అనుమకొండ, ఐనవోలు, పానగల్లు, నందికంది, శనిగరం, పుష్పగిరి, అమరావతి, సామర్లకోట, భీమ వరం, పాలకొల్లు, 1300 వైష్ణవాల యాలు, 2400 మల్లారదేవుని గుళ్ళు...భైరవ, దుర్గ గణపతి దేవుళ్ళవి కలిపి 4400 గుడులు ఉండేవని స్పష్టమవు తున్నది.వెలమరాజుల కాలంలో కాళిక, దుర్గ, చండి, భద్రకాళి, మహిశాసుర మర్ధిని, కట్టమైసమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, ఏకవీర దేవతల ఆరాధన ఉన్నట్లు తెలుస్తున్నది.

# ఆగని నీటి యుద్ధం

**హైదరాబాద్, జూన్ 10 :** నీళ్లు, నిధులు, నియామకాలు.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు ఊపిరిలూదిన ప్రాథమిక నినాదాం. కానీ, ఆ నినాదాలు నినాదాలుగానే మిగిలిపోతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం (12 ఏళ్లు) గడిచినా ఉమ్మడి ప్రాజెక్టుల నీటి వినియోగంలో నదీ జలాల వాటాల పంపకంలో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికీ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూనే ఉంది. కృష్ణా జలాల్లో ఇరు రాష్ట్రాలకు వాటాల కేటాయింపులో అప్పటి ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించకపోవడంతో నష్టపోయామని మేధావులు, ఇంజినీర్లు, తెలంగాణ వాదులు అంటున్నారుకనీసం నిర్ణయించిన వాటాను సైతం ఉపయోగించుకో కుండా.. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు వత్తా సు పలుకుతుండటాన్ని వారు ఎత్తిచూపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి ఇంకా దిగజారిందని, పక్క రాష్ట్రానికి గేట్లు బార్లా తెరవ డంతో.. వాటాను మించి ఉపయోగించుకుంటుందని తెలంగాణ ఇంజినీర్లు చెబు తున్నారు. స్వరాష్ట్రంలోనూ జరుగుతున్న ఏపీ జల దోపిడీని పాలకులు చూసీ చూడనట్టుగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొదట్లో ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కృష్ణా జలాలను 66:34 నిష్పత్తిలో వినియోగించుకోవాలి. అయితే ఈ ఒప్పందమే సరికాదని అందరూ అం టుంటే.. అసలు చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారమైనా కృష్ణా జలాలను వినియోగించుకున్నారా అంటే.. అదీ లేదని అధికారిక గణాంకాలను చూస్తే అర్థం అవుతుంది. గడిచిన 12 ఏళ్లలో కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్ వినియోగించిన మొత్తం శాతం 826.64 కాగా.. ప్రతి సంవత్సరం సగటున 68.88 శాతం (ఏపీకి 66 శాతం వాటా) తరలిస్తోంది. అంటే సగటున ప్రతి సంవత్సరం సుమారు 3 శాతం నీటిని అదనంగా వాడుకుంటున్నట్టుగా చెప్పవచ్చు. తెలంగా ణ విషయానికి వచ్చేసరికి.. 12 ఏళ్లలో 374.36 శాతం.. అంటే ఏటా సగటున 31.19 శాతం జలాలను మాత్రమే వాడుకున్నది.ఈ లెక్కన ప్రతి సంవత్సరం సగటున సుమారు 3 శాతం వరకు (తెలంగాణ వాటా 34 శాతం) కృష్ణా జలాలను తెలంగాణ నష్టపోయిందనే చెప్పవచ్చు. అంటే ఒక సంవత్సరంలో ఎంతమేర తెలంగాణ కృష్ణా నదీ జలాలను వాడుకోవాలో గడిచిన 12 ఏండ్ల లో అంతమేర నష్టపోయినట్టే. ఇది వందల టీఎంసీలలో ఉంటుంది. నిజానికి ప్రత్యేక తెలంగాణ వచ్చిందే.. నీళ్లు, నిధులు, నియామకాలలో దోపిడీ జరుతుందనే. అందుకే దశాబ్దాలుగా పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నారు. కానీ,ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటికీ.. ఇంకా జల దోపిడీ కొనసాగుతూనే ఉందని మేధావులు, ఇంజనీర్లు, తెలంగాణీయులు భగ్గుమంటున్నారు. రాష్ట్రం ఏర్పడిన సంవత్సరం (2014–15)లో తెలంగాణ తనకు కేటాయించిన వాటా (34 శాతం)లో కేవలం 30 శాతం మాత్రమే ఉపయోగించుకుంది.కానీ, ఏపీ తనకు కేటాయించిన (66 శాతం) వాటాను మించి 69.92 శాతం జలాలను వినయోగించుకుంది. 2015–17 వరకు ఒకటి.. అర శాతం వరకు తగ్గింది. 2023–24లో ఎన్నికల ప్రభావం కారణంగా 34 శాతానికి మించి చరిత్రలో మొదటిసారిగా తెలంగాణ 36.34 శాతం జలాలను వియోగించుకోవడం ఇక రికార్డు. ఆ తరువాత కూడా కేటాయింపుల దరిదాపుల్లోకి కూడా తెలంగాణ రాలేదు. పుష్కర కాలంలో కేవలం ఒకే ఒకసారి వాటాను మించి కృష్ణా నదీ జలాలను తెలంగాణ ఉపయోగించుకుంది. ఇక మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొంది.. పాలనా పగ్గాలు చేపట్టిన తరువాత.. పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యింది. 2024–25లో 28.27 శాతం జలాలను మాత్రమే తెలంగాణ వినియోగించుకోగా.. ఏపీ మాత్రం 72.73 శాతం తరలించుకుపోయింది. ఇక ఎన్నడూ లేని విధంగా 2025–26లో ఇప్పటి వరకు కేవలం 25.10 శాతం మాత్రమే జలాలను తెలంగాణ వినయోగించుకుంటే.. పుష్కర కాలంలోనే అత్యధికంగా ఏపీ 74.90 శాతం జలాలను తరలించుకుపోవడం గమనార్హం. అంటే ఈ సంతవ్సరం వాటా (66శాతం) కంటే సుమారు 10 శాతం జలాలను అదనంగా తరలించుకుపోవడాన్ని తెలంగాణ మేధావులు, ఇంజనీర్లు, తెలంగాణీయులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.ఈ ఏడు ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణ వర్షాలు సరిగ్గా కురవవని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇ ప్పటికే రిజర్వాయర్లలో జలా లు అడుగంటాయి. ఈ నేపథ్యంలో ఏపీ జలచౌర్యానికి అడ్డుకట్ట వేయాల్సిన కాంగ్రెస్ పార్టీ అలసత్వం వహిస్తుంద న్న విమర్శలున్నాయి. కాంగ్రెస్ పార్టీ పాలనా పగ్గాలు చేపట్టిన తరువాతనే ఏపీ అధ్యధికంగా జల దోపిడీ చేస్తుండటాన్ని తెలంగాణీయులు ఎత్తిచూపుతున్నారు.

# నిబంధనలకు నీళ్లు

**నల్గొండ, జూన్ 10 :** ఏదైనా పరిశ్రమలకు అనుమతులు రావాలంటే ఖచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే. అయితే కొన్ని పరిశ్రమలు అనుమతులు వచ్చిన తర్వాత ఆ నిబంధనలకు నీళ్ళొదులుతూ తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కేవలం లాభాల కోసం నడుపుతుంటారు. సరిగ్గా ఇదే విధానం నేడు జిల్లాలోని మేళ్లచెరువులో మైహోమ్ (మహా) సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం అవలంబిస్తున్నట్లు తెలుస్తుందిపర్యావరణ, మైనింగ్ నిబంధనల మేరకే తమ సంస్థ పనిచేస్తుందని చెప్పుకునే యాజమాన్యం అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. వాస్తవికంగా సున్నపురాయి మైనింగ్ కోసం ప్రభుత్వ భూమిని లీజుకు తీసుకొన్న మైహోమ్ సిమెంట్స్ పరిశ్రమ ఏకంగా మైనింగ్ లీజు భూమిలో ప్రైవేట్ రైల్వే లైన్ నిర్మించుకుందనేది స్థానికులందరూ చర్చించుకుంటున్న మాట. ఇంతటితోనే ఆగకుండా మైనింగ్ లీజు భూమిని కబ్జా చేసి భారీ నిర్మాణాలకు పాల్పడుతున్నారనే అభియోగాలు ఉన్నాయి.అక్రమంగా క్రయ, విక్రయాలు జరుపుతున్నట్లు స్థానికుల ద్వారానే తెలుస్తుంది .చెట్టు పేరు చెప్పి కాయలు అమ్మిన చందంగా మైహోం సిమెంట్ సంస్థ పేరు చెప్పి కొందరు భూకబ్జాదారులు మైహోమ్ సిమెంట్స్ మైనింగ్ లీజు భూమిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనీ కొందరు స్థానికుల ద్వారా తెలుస్తుంది. ప్రస్తుత టెక్నాలజీ ప్రకారం మైనింగ్ భూమిలో నిబంధనలకు మించి సెంటు భూమి కబ్జా చేసిన చర్యలు దిగుతున్న ప్రభుత్వాలు మైహోమ్ సిమెంట్స్ పరిశ్రమ యాజమాన్యం ఏకంగా ప్రైవేట్ రైల్వే లైన్ నిర్మించినా అడ్డుకోకపోగా భూకబ్జాలను ప్రోత్సహిస్తున్నారంటూ అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.మేళ్లచెరువు మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 874లో 567 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలోనే 30ఎకరాల్లో తాసిల్దార్ ఆఫీస్, పోలీస్ స్టేషన్, ఎంపిడిఓ ఆఫీస్, జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ సహా ఎస్సీ కాలనీ ఇండ్లు ఉన్నాయి. ఇదే సర్వే నెంబర్ గల భూమిలో 141.644 హెక్టార్ల భూమిని సున్నపురాయి మైనింగ్ కోసం మైహోమ్ సిమెంట్ పరిశ్రమకు 1983లో ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. అప్పటి దేవి సిమెంట్స్ పర్యావరణ అనుమతులు తీసుకొని కేంద్ర ప్రభుత్వ అనుమతుల మేరకు మైనింగ్ కార్యకలాపాలు మాత్రమే నిర్వహిస్తుంది. ఇటీవల 2023లో మైహోమ్ సిమెంట్స్ పర్యావరణ అనుమతులను రెన్యువల్ చేసుకుంది. షరతులతో కూడిన అనుమతులను పర్యావరణ శాఖ జారీ చేసింది.కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పు శాఖ జారీ చేసిన పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా మైహోం సిమెంట్స్ పరిశ్రమ మైనింగ్ భూమిలో రైల్వే లైన్ నిర్మాణం చేపట్టిందనేది అందరికి కనిపిస్తున్న విషయమే. మైనింగ్ లీజు అగ్రిమెంట్ ప్రకారం భూమిని మైనింగ్ కోసమే వినియోగించాలి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులు విరుద్ధంగా ఎటువంటి నిర్మాణాలు, ఇతర కార్యకలాపాలు చేపట్టరాదు. ఒకవేళ ఏమైనా నిర్మాణాలు, ఇతర కార్యక్రమాలు చేపట్టినా ఖచ్చితంగా పర్యావరణ శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ మైహోమ్ సిమెంట్ పరిశ్రమ పర్యావరణ , మైనింగ్ శాఖ కల్లుగప్పి ఏకంగా ప్రైవేట్ రైల్వే ట్రాక్ నిర్మించుకుందనేది స్థానికంగా పెద్ద ఎత్తున వినిపిస్తున్న విమర్శ. 2009లో ఈ మైనింగ్ భూమిని అనుకొని ప్రభుత్వం రైల్వేలైన్ నిర్మించింది. ప్రభుత్వం నిర్మించిన రైల్వేలైన్ కింద మైహోమ్ సిమెంట్స్ మైనింగ్ భూమి కొంతమేర కోల్పోయింది. మైహోమ్ సిమెంట్స్ సైతం మైనింగ్ భూమిలో ఏకంగా తమ అవసరార్థం రైల్వే లైన్ నిర్మించింది. ఇది కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ జారీచేసిన ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పరచారనేది ప్రధాన అభియోగం. ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ పత్రంలో కేంద్ర ప్రభుత్వం విధించిన నిబంధన ప్రకారం మాత్రమే మైనింగ్ నిర్వహించాల్సి ఉన్నా అందుకు భిన్నంగా మైహోమ్ సిమెంట్స్ వ్యవహరిస్తుందనీ కొందరు బాహాటంగానే విమర్శిస్తున్నారు.మై హోమ్ సిమెంట్స్ తమ కంపెనీ అవసరార్థం రైల్వే ట్రాక్ నిర్మించుకోవాల్సి వస్తే తన సొంత భూమిలో నిర్మించుకోవాల్సి ఉన్న నిబంధనలకు విరుద్ధంగా సున్నపురాయి మైనింగ్ కోసం కేటాయించిన భూమిలో పర్యావరణాన్ని అనుమతులకు విరుద్ధంగా రైల్వే ట్రాక్ నిర్మించిందనీ ప్రధానంగా వినిపిస్తున్న విమర్శ. ఈ మైనింగ్ భూమి కాకుండా సర్వేనెంబర్ 1057లోని పట్టా భూముల్లో రైల్వే ట్రాక్, లోడింగ్ అన్లోడింగ్ పాయింట్ నిర్మించినప్పటికీ కనీసం గ్రామపంచాయతీ నుండి కూడా ఎటువంటి అనుమతులు తీసుకోలేదనేది కొందరు స్థానికుల వాదన. .2015లో నిర్మించిన ఈ రైల్వే లోడింగ్ పాయింట్ కి ఇప్పటివరకు కనీసం ఇటువంటి పన్నులు కూడా చెల్లించలేదని విశ్వసనీయంగా తెలిసింది. ఈ రైల్వే ట్రాక్, లోడింగ్ పాయింట్ 12 హెక్టార్లలో మైహోమ్ సిమెంట్ నిర్మించగా, రైల్వే ట్రాక్ కోసం 6 హెక్టార్ల మైనింగ్ లీజు భూమిని వాడుకున్నట్లు తెలిసింది.ఆరు నెలలకు ఒకసారి సున్నపురాయి మైనింగ్ కోసం మైహోమ్ సిమెంట్స్ పర్యావరణ అనుమతులు కొనసాగిస్తుండగా, అదేవిధంగా ఎప్పటికప్పుడు మైనింగ్ కార్యకలాపాలపై ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ కేంద్ర ప్రభుత్వ సంస్థ లెక్కలు కడుతున్నప్పటికీ మైనింగ్ భూమిలో మైహోమ్ సిమెంట్ నిర్మించిన రైల్వేట్రాక్ పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. బహిరంగంగా పర్యావరణ అనుమతులకు ఉల్లంఘించినప్పటికీ పర్యావరణ శాఖ ఇటువైపున కన్నెత్తి చూడదంలేదు అని పలువురు విమర్శిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కన్నుసన్నల్లో నడిచే సున్నపురాయి మైనింగ్ పై మిన్ను కుండటం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అక్రమ నిర్మాణపై విచారణ జరిపి మైహోం సంస్థ పై చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


# అమ్మకాలలో విస్కీదే టాప్

**హైదరాబాద్, జూన్ 10 :** తెలంగాణ మద్యం విక్రయాల్లో అత్యధిక వాటా విస్కీదేనని గణాంకాలు చెబుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే.. తెలంగాణలో మద్యం ప్రియులు.. విస్కీకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. ఇక త్వరలోనే తెలంగాణలో మద్యం ధరలు పెంచేందుకు సర్కార్ ప్రయత్నాలు చేస్తుండటంతో.. విస్కీ లవర్స్‌కు షాక్ తప్పదనే వాదనలు వినిపిస్తున్నాయి. మద్యం ధరల పెంపు ప్రతిపాదనలతో మందుబాబుల్లో తెలియని ఆందోళన నెలకొంది.తెలంగాణలోని ఏ వైన్స్, ఏ బార్‌లోకి వెళ్లినా విస్కీ అమ్మకాలే ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం వేసవి కాలం సందర్భంగా ఎండవేడిమిని తట్టుకునేందుకు మద్యం ప్రియులు.. చల్లని బీర్లు తాగుతున్నా.. విస్కీ అమ్మకాలే అత్యధికంగా ఉంటాయని లెక్కలు చెబుతున్నాయి. తెలంగాణ మద్యం మార్కెట్‌లో విస్కీదే సింహభాగం ఉంటుంది. తక్కువ ధర బ్రాండ్ల మద్యం దగ్గరి నుంచి ఖరీదైన బ్రాండ్ల వరకు మందుబాబులు విస్కీకే ఓటేస్తున్నారు. మరీ ముఖ్యంగా దక్షిణ భారతదేశ రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో విస్కీ వినియోగం అత్యధికంగా ఉంది. ఇదే సమయంలో.. తొందర్లోనే రాష్ట్రంలో మద్యం ధరలు పెంచేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్న నేపథ్యంలో విస్కీ ప్రియుల జేబుకు చిల్లు తప్పదనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. 2026లో మద్యం మార్కెట్ గణాంకాల ప్రకారం.. తెలంగాణలో అమ్ముడు అవుతున్న ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్‌లో విస్కీ వాటా ఏకంగా 84.89 శాతం ఉన్నట్లు వెల్లడైంది. దీంతో దేశంలోనే అత్యంత ఎక్కువ విస్కీ విక్రయించే రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటిగా నిలిచింది. ఇది కర్ణాటకలో 76.50 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 55 శాతం మాత్రమే ఉంది. మరోవైపు.. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికీ బ్రాండీ వినియోగమే ఎక్కువగా ఉండటం గమనార్హం. హైదరాబాద్‌లోని ఐటీ, సర్వీస్ సెక్టార్ ఉద్యోగుల్లో పెరుగుతున్న డిమాండ్ కారణంగా బ్రీజర్ల వాటా 3.32 శాతంగా నమోదైనట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి.తెలంగాణలో విస్కీ అంటే కేవలం మద్యం మాత్రమే కాదని.. సామాజిక జీవనంలో ఒక భాగమైపోయిన అలవాటు అని హైదరాబాద్‌కు చెందిన లిక్కర్ మార్కెట్ విశ్లేషకుడు ఒకరు చెప్పారు. అందుకే మద్యం ధరలు పెరిగితే.. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోని కుటుంబాలు, రిటైల్ వ్యాపారులు, హాస్పిటాలిటీ రంగంపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.తెలంగాణలో మీడియం, ప్రీమియం విస్కీ బ్రాండ్లకు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. మొత్తం విస్కీ అమ్మకాల్లో 45.9 శాతం క్వార్టర్ రూ.170 నుంచి రూ.260 మధ్య ధర కలిగిన బాటిళ్లే ఉండటం గమనార్హం. ఇక రూ.110 ధర కలిగిన క్వార్టర్ల వాటా 22.69 శాతం ఉండగా.. రూ.140–160 ధరల విస్కీలు 21.07 శాతం అమ్మకాలు అయినట్లు లెక్కలు చెబుతున్నాయి. అదే సమయంలో రూ.270–రూ.350 ధరల ప్రీమియం విస్కీల వాటా 6.54 శాతం కాగా.. రూ.350 కంటే ఎక్కువ ధర కలిగిన ప్రీమియం బ్రాండ్ల వాటా 3.8 శాతంగా ఉంది. తెలంగాణలో అమ్ముడయ్యే ప్రతీ 10 ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ బాటిళ్లలో దాదాపు 9 బాటిళ్లు విస్కీయే కావడం విశేషం.ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్‌లో విస్కీ తర్వాత బ్రాండీ నిలిచింది. బ్రాండీ వాటా కేవలం 9.21 శాతం మాత్రమే ఉంది. ఆ తర్వాత వోడ్కా 1.24 శాతం, వైన్ 0.88 శాతం, రమ్ 0.32 శాతం, జిన్ 0.09 శాతం, లిక్యూర్ 0.04 శాతం, టెకిలా కేవలం 0.01 శాతం మాత్రమే వాటాను కలిగి ఉన్నాయి. ఒకప్పుడు దక్షిణ భారత రాష్ట్రాల్లో బ్రాండీకి భారీగా డిమాండ్ ఉండేది. అయితే తెలంగాణలో ప్రస్తుతం అది భారీగా తగ్గిపోయింది. బ్రాండీ విభాగంలో కూడా రూ.150 నుంచి రూ.200 మధ్య ధరల ఉత్పత్తులే 63.99 శాతం అమ్మకాలను సాధిస్తున్నాయి.మరోవైపు.. తెలంగాణలో బీర్ అమ్మకాల్లో కూడా కీలక మార్పులు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు స్ట్రాంగ్ బీర్‌కు ఎక్కువ ఆదరణ ఉండగా.. ప్రస్తుతం లైట్ బీర్ వైపు మందుబాబులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. మొత్తం బీర్ అమ్మకాలలో లైట్ బీర్లు 55.97 శాతం ఉండగా.. 44.03 శాతం స్ట్రాంగ్ బీర్ల వాటా నమోదైంది. మార్కెట్ వర్గాల ప్రకారం.. తక్కువ ఆల్కహాల్ ఉన్న పానీయాల వైపు యువత మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది.

# మెట్రో ప్రాజెక్ట్... 820 కోట్ల నష్టపరిహారం...


**హైదరాబాద్, జూన్ 10 :** హైదరాబాద్ పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మొత్తం 888 ఆస్తులకు గాను 825 ఆస్తుల సేకరణ పూర్తయిందని, ఇది దాదాపు 93 శాతానికి సమానమని మెట్రో రైలు అధికారులు వెల్లడించారు.మిగిలిన ఆస్తులలో మూడు పురాతన కట్టడాలు వారసత్వ కట్టడాల పరిరక్షణ కమిటీ పరిశీలనలో ఉన్నాయి. 10 కోర్టు కేసులతో పాటు, మరికొన్ని ఆస్తుల వివాదాలు భూసేకరణ, పునరావాసం, రీసెటిల్‌మెంట్ అథారిటీ (ఎల్ఏఆర్ఆర్) పరిధిలో ఉన్నాయి. కొన్ని ఆస్తులు వక్ఫ్ బోర్డుకు చెందినవని తెలియక గతంలోనే కొనుగోలు చేశామని, ఇప్పుడు నోటీసులు ఇవ్వడంతో వివాదాలు మొదలయ్యాయని కొందరు పేర్కొంటున్నారు.బాధితులకు ఇప్పటికే సుమారు రూ. 820 కోట్ల పరిహారం చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. మార్గంలో దారుల్‌షిఫా, పాత హవేలీ, హరిబౌలి, అలీజా కోట, శాలిబండ, పంషీర్‌గంజ్, ఫలక్‌నుమా మీదుగా ఈ ప్రాజెక్టు వెళ్తుంది. చారిత్రక కట్టడాలకు హాని కలగకుండా పనులు చేపడుతున్నామని, అలీయాబాద్ వంటి ప్రాంతాల్లో త్వరలో కూల్చివేతలు జరిపి రోడ్డు విస్తరణ చేస్తామని అధికారులు వివరించారు. దీని పర్యవేక్షణ కోసం జనరల్ కన్సల్టెన్సీకి టెండర్లు పిలిచారు.

# కిషన్ వర్సెస్ రేవంత్



హైదరాబాద్, జూన్ 10 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కాలంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని టార్గెట్ చేశారు. బీజేపీపై పదే పదే విమర్శలు చేస్తున్నారు. గత రెండేళ్లలో బీజేపీపై ఇలాంటి, ఈ స్థాయిలో రేవంత్ రెడ్డి విమర్శలు చేయలేదు. కానీ గత కొన్ని రోజుల నుంచి బీజేపీ కేంద్ర నాయకత్వం, మోదీ, కిషన్ రెడ్డిలతో సహ అందరిపైనా విమర్శలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తుందన్నది రేవంత్ రెడ్డి ఆరోపణ. అయితే బీజేపీ నేతలు మాత్రం పాలన చేతకాక కేంద్ర ప్రభుత్వం పై రేవంత్ రెడ్డి విమర్శలు చేస్తున్నారంటున్నారు. గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే రేవంత్ రెడ్డి తనకు ప్రధాన ప్రత్యర్థి బీఆర్ఎస్ కాదని, బీజేపీ మాత్రమేనని ఫిక్సయినట్లు తెలిసింది.తెలంగాణలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని అన్నదాతలు ఆందోళనకు దిగుతున్నారు. అయితే ఇందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. మరో వారం రోజుల్లో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం సేకరిస్తుందని, దానిని కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. అందుకు కిషన్ రెడ్డి కూడా కేంద్రంతో సహకరించాలని కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రానికి రావాల్సిన అనుమతులను కిషన్ రెడ్డి కావాలని అడ్డుకుంటున్నారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. మెట్రో రైలు విస్తరణ, మూసీ సుందరీకరణ వనులకు కేంద్రం సహకరించకపోవడానికి కిషన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం పెద్దలతో మాట్లాడినందునేనని రేవంత్ ఆరోపిస్తున్నారు.అలాగే తుమ్మిడి హట్టి ప్రాజెక్టుకు సంబంధించి అవసరమైన స్థలం కోసం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తో చర్చించాలనుకున్నప్పటికీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాత్రం అందుకు సహకరించడం లేదని చెబుతున్నారు. ఇలా దాదాపు అన్ని అంశాల్లోనూ కేంద్ర ప్రభుత్వంతో పాటు కిషన్ రెడ్డిని కూడా రేవంత్ రెడ్డి టార్గెట్ చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల కోసమే ఈ విమర్శలు చేస్తున్నారని బీజేపీ ఆరోపిస్తుంది. బీజేపీ తెలంగాణలో పుంజుకుంటుందని భావించి రేవంత్ రెడ్డి డైవర్షన్ డ్రామాలకు తెరలేపుతున్నారంటూ బీజేపీ చీఫ్ రామచంద్రరావు లాంటి నేతలు ఆరోపిస్తున్నారు. మొత్తం మీద తెలంగాణ రాజకీయాల్లో రేవంత్ వర్సెస్ కిషన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం వాడి వేడిగా జరుగుతుంది.

# తెలంగాణలో భారీగా తగ్గనున్న టెక్స్ట్ బుక్స్



**హైదరాబాద్, జూన్ 10 :** 2026–27 విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో తల్లిదండ్రులు, విద్యార్థులకు భారీ ఊరటను ఇచ్చే వార్త వచ్చింది. విద్యార్థుల పుస్తకాల ధరలు భారీగా తగ్గడం విశేషం. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి పాఠ్య పుస్తకాల ధరలు తగ్గడంతో.. ఆర్థికంగా కాస్త రిలీఫ్ లభించింది. గరిష్ఠంగా 20 శాతం వరకు ధరలు తగ్గడంతో విద్యార్థులు ఆనందంగా ఫీల్ అవుతున్నారు. ఒకవైపు యుద్ధం కారణంగా అన్ని రకాల వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ.. పుస్తకాల ధరలు తగ్గడం గమనార్హం. అయితే ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం కొన్ని రోజుల క్రితం పుస్తకాల ప్రింటింగ్ కోసం.. టెండర్లను పిలిచింది. ఈ టెండర్లలో 3 ప్రింటింగ్ సంస్థలు గతం కంటే 20 శాతం తక్కువగా కోట్ చేయడంతో పుస్తకాల ధరలు దిగి వచ్చాయి.గతంలో ఒక్కో పేజీ ప్రింటింగ్ ధర 54 పైసలు ఉండగా.. అది ప్రస్తుతం 44.50 పైసలకు దిగి వచ్చింది. ఉదాహరణకు 1వ తరగతిలోని 3 పుస్తకాలు కలిపి గతేడాది రూ.247లు కాగా.. ఈసారి రూ.209కి తగ్గాయి. ఇఖ 10వ తరగతిలోని మొత్తం 8 పుస్తకాల ధర గత విద్యా సంవత్సరంలో రూ.1,078 ఉండగా ఈసారి రూ.900కి తగ్గింది. అంటే.. ఒక్క టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఈ ఏడాది రూ.178 ఆదా అయ్యాయి. జూన్ 5వ తేదీ నుంచి కొత్త పుస్తకాలు మార్కెట్లో అందుబాటులోకి రానున్నాయి.మరోవైపు.. పుస్తకాల ధరలు తగ్గినంత మాత్రాన.. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రింటింగ్‌లో, బైండింగ్‌లో ఎలాంటి రాజీ లేకుండా.. మెరుగైన క్వాలిటీతో లామినేటెడ్ పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. ఇక.. వరుసగా 4వ ఏడాది కూడా పాఠ్యపుస్తకాల ధరలు తగ్గడంతో.. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పింది. 2023–24 అకడమిక్ ఇయర్‌లో 10వ తరగతి విద్యార్థుల పుస్తకాల కోసం రూ.1,482 ఖర్చు కాగా.. 2025–26లో అది రూ.1,078కు దిగి వచ్చింది. తాజా తగ్గింపుతో ఈ ఏడాది టెన్త్ టెక్స్ట్ బుక్స్ సెట్ ధర రూ.900కు తగ్గింది.అదే విధంగా 9వ తరగతి పుస్తకాల సెట్ ధర రూ.927 నుంచి రూ.776కు (రూ.151) తగ్గింది. 8వ తరగతి పుస్తకాల సెట్ ధర రూ.825 నుంచి రూ.690కి (రూ.135) తగ్గాయి. ప్రైమరీ క్లాసులకు కూడా ఒక్కో సెట్‌పై రూ.35 నుంచి రూ.60 వరకు ధరలు తగ్గాయి. ఇక సబ్జెక్టుల వారీగా పుస్తకాల ధర తగ్గింపు చూస్తే.. టెన్త్ మ్యాథ్స్ టెక్స్ట్ బుక్ ధర గతంలో రూ.225 ఉండగా.. ఇప్పుడు రూ.187కు తగ్గింది. సోషల్ పుస్తకం రూ.192 నుంచి రూ.160కి తగ్గింది. 9వ తరగతి మ్యాథ్స్ బుక్ రూ.201 నుంచి రూ.167కు.. 8వ తరగతి మ్యాథ్స్ రూ.205 నుంచి రూ.171కి తగ్గిందిఅయితే గతం కంటే ఇప్పుడు.. ముడి సరుకుల ధరలు 20 శాతం పెరిగినప్పటికీ.. పబ్లిషర్లు మాత్రం గతేడాది కంటే తక్కువ ధరకే పుస్తకాలను ముద్రించేందుకు ముందుకు రావడం గమనార్హం. గతేడాది ఎల్1 గా నిలిచిన ఆర్క్‌బర్డ్ సంస్థ పేజీకి 54 పైసలు కోట్ చేయగా.. ఈ ఏడాది నవతెలంగాణ ప్రింటర్స్, డీకే పబ్లికేషన్స్, సూపర్ ప్రింటర్స్ సంస్థలు కేవలం 44.50 పైసలకే పుస్తకాలను ప్రింట్ చేస్తామని ప్రకటించి.. ఎల్–1గా నిలిచాయి.

# మేడిపల్లి హెచ్ఎండీఏ లేఅవుట్‌ను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

-లేఅవుట్‌లో అప్రోచ్ రోడ్డు, విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

-పార్కులు, ఆలయాలకు కేటాయించిన భూముల కబ్జాలను వెంటనే అరికట్టాలి

-రూ.కోట్ల అప్పులు చేసి ప్లాట్లు కొంటే ఇబ్బందులకు గురి చేయడం తగదు

-సమస్యలు పరిష్కరించిన తర్వాతనే మూడో విడత వేలం పాట నిర్వహించాలి





**కాప్రా జూన్ 10**

మూడేళ్ల కింద ఏర్పాటు చేసిన మేడిపల్లి హెచ్ఎండీఏ లేఅవుట్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. క్లియర్ టైటిల్, అద్భుతమైన మౌలిక సదుపాయాల పేరుతో ప్లాట్లు వేలం వేసిన హెచ్ఎండీఏ.. కొనుగోలుదారులను నట్టేట ముంచుతోంది. 18 నెలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని, లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చి, మూడేళ్లు గడుస్తున్నా.. సగం పనులు కూడా పూర్తి చేయలేదు. తాజాగా, ఈ లేఅవుట్‌ను నిషేధిత జాబితాలో చేర్చడం, రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం.. కొనుగోలుదారులు మరియు వారి కుటుంబాలను తీవ్ర మానసిక క్షోభకు గురి చేస్తోంది. హెచ్ఎండీఏ అధికారుల వైఖరిని నిరసిస్తూ.. దివి.10.06.2026(బుధవారం) రోజున అమీర్‌పేట్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయంలో మేడిపల్లి హెచ్ఎండీఏ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఈ క్రింది సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. 1. మేడిపల్లి హెచ్ఎండిఏ లేఅవుట్‌ను నిషేధిత జాబితా(22ఎ)లో జాబితాలో చేర్చడం వల్ల రిజిస్ట్రేషన్లు, రుణాలు, నిర్మాణ అనుమతులు నిలిచిపోయాయి. తక్షణమే నిషేధిత జాబితా నుంచి తొలగించాలి. క్లియర్ టైటిల్ పేరుతో హెచ్ఎండిఏ వేలం వేసి, ప్లాట్లు అమ్మి, ఇప్పుడు.. నిషేధిత జాబితాలో చేర్చడం తగదు. ఈ అంశం కొనుగోలుదారులు, మరియు వారి కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. అవసరాలకు అమ్ముకోవాలన్నా, రుణాలు తీసుకోవాలన్నా.. ఇబ్బందికరంగా మారింది. 2. లేఅవుట్ ఏర్పడి మూడు సంవత్సరాలు కావొస్తున్నా.. నేటికీ విద్యుత్ సబ్ స్టేషన్ పనులను మొదలుపెట్టలేదు. భవన నిర్మాణాలకు కీలకమైన విద్యుత్ సరఫరా పనులను ప్రారంభించకపోవడాన్ని తీవ్రమైన అంశంగా పరిగణించాలి. ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు ఇండ్లు నిర్మించుకోకుండా, మూడేళ్లుగా రూ.వేలకు వేలు అద్దెలు కట్టుకుంటూ ఇతర ప్రాంతాల్లో నివసించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇండ్లు నిర్మించుకోవడం లేదని బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచుతూ.. ఆర్థిక క్షోభకు గురి చేస్తున్నాయి. 3. లేఅవుట్‌లో 60 ఫీట్ల అప్రోచ్ రోడ్డు సమస్యను తక్షణమే పరిష్కరించాలి. సదరు రైతులు కోర్టు నుంచి కేసులు విత్‌డ్రా చేసుకున్నప్పటికీ.. రెవెన్యూ, హెచ్ఎండిఏ అధికారులు భూమిని సేకరించడం లేదు. రోడ్డు వేయడం లేదు. దీనివల్ల మేడిపల్లి లేఅవుట్ తల లేని మొండెంలా తయారైంది. 4. మేడిపల్లి లేఅవుట్‌లో భూకబ్జాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి. ఆలయాలకు కేటాయించిన భూములు, పార్కు జాగాలూ అన్యాక్రాంతానికి గురి అవుతున్నాయి. కొందరు ప్రైవేటు వ్యక్తులు.. సొంతంగా దేవుడి విగ్రహాలు పెట్టి, ఆక్రమించుకున్నారు. పార్కు స్థలంలోనూ విగ్రహం పెట్టారు.

**నిర్లక్ష్యంగా అధికారుల సమాధానం..**

వేలం పాట నిర్వహించి, కొనుగోలుదారుల నుంచి రూ.వందల కోట్లు వసూలు చేసిన హెచ్ఎండీఏ అధికారులు.. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. హెచ్ఎండీఏ కేవలం ఒక ఏజెన్సీగా మాత్రమే పనిచేస్తోందని, లేఅవుట్‌పై వచ్చిన రెవెన్యూ సమస్యలకు హెచ్ఎండీఏ బాధ్యత వహించదని సమాధానం ఇవ్వడం గమనార్హం. మరి క్లియర్ టైటిల్ అని ఎందుకు ప్రచారం చేశారని నిలదీస్తే.. సమాధానం దాటవేస్తున్నారు. ఒకవైపు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి, రుణాలు ఆగిపోయి కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతుంటే.. హెచ్ఎండీఏ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ మరియు విద్యుత్ సరఫరా ఎప్పుడు ఇస్తారని అడిగితే.. మరో మూడు నాలుగు నెలలు పడుతుంది అని చెప్పడం వారి పనితనానికి అద్దం పడుతోంది. అప్రోచ్ రోడ్డు సమస్య కూడా తమ పరిధిలో లేదని, రెవెన్యూ అధికారులను అడగాలని చెప్పడంపై కొనుగోలుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎండీఏ బాధ్యత వహించకుంటే లేఅవుట్‌లో అప్రోచ్ రోడ్డు ఎందుకు చూపించారని ప్రశ్నిస్తే.. సమాధానం ఇవ్వడం లేదు.

ఇట్లు HMDA COLONY WELFARE ASSOCIATION, MEDIPALLY ఎంపల్లి పద్మారెడ్డి (అధ్యక్షులు) ఈదునూరి హేమంత్ కుమార్ (ప్రధాన కార్యదర్శి)

# కాప్రా పరిధిలోలి మహిళా అదృశ్యం

**కాప్రా జూన్ 10**



ఫిర్యాదుదారు జి రుక్మిణి తెలిపిన వివరాల ప్రకారం తన కూతురు జి వర్ష వయస్సు 19 సంవత్సరాలు పారామెడికల్ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం పూర్తి చేసుకుంది తర్వాత స్కిన్ కేర్ హాస్పిటల్ హై టెంషన్ రోడ్ కాప్రా యందు పార్ట్ టైం జాబ్ చేస్తుంది. తను రోజు డ్యూటీ కి వెళ్లి తిరిగి సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటికి వస్తుంది కానీ తేదీ 9. 6. 2026 మంగళవారం నాడు రోజు మాదిరిగానే డ్యూటీ కి వెళ్ళింది కానీ తిరిగి ఇంటికి రాలేదు. ఫిర్యాదుదారు తన కూతురికి కాల్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది తన కూతురి ఆచూకీ కోసం ఫిర్యాదుదారు చుట్టుపక్కల మరియు తెలిసిన వారి వద్ద వెతికిన ఎటువంటి సమాచారం లభించలేదు. ఫిర్యాదుదారు తన కూతురి వివరాలు ఈ క్రింది విధంగా తెలిపినది ఎత్తు 5 ఫీట్ల 4 ఇంచులు, తెలుగు, ఇంగ్లీష్ , తమిళ్ , హిందీ మాట్లాడగలదు చివరగా ఇంట్లో నుండి వెళ్లిపోయే సమయంలో ఎల్లో కలర్ టాప్, వైట్ కలర్ ప్యాంటు ధరించినది. ఈ యొక్క ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము.

# భవన నిర్మాణ కార్మిక సంఘం బందుకు 'బీసీ ఐక్యవేదిక' సంపూర్ణ మద్దతు!





**తెలంగాణ షాన్, జూన్ 10.**

?జవహర్‌నగర్,భవన నిర్మాణ కార్మిక సంఘం, తాపీ మేస్త్రీల న్యాయమైన డిమాండ్ల సాధనకై బుధవారం పిలుపునిచ్చిన కార్మిక సంఘం బంద్ జవహర్‌నగర్ 10వ కీసర సర్కిల్ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తాలో శాంతియుతంగా, ప్రశాంతంగా ముగిసింది. ఈ బంద్ కార్యక్రమానికి బీసీ ఐక్యవేదిక (నవభారత్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా బంద్‌లో పాల్గొన్న బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు మారోజు సోమాచారి మాట్లాడుతూ.. జవహర్‌నగర్ ఇంత పెద్ద నగరంగా ఎదగడానికి, ఇక్కడి అద్దాల మేడల వెనుక తాపీ మేస్త్రీల శ్రమ, త్యాగం ఎంతో ఉన్నాయని కొనియాడారు. చేతిలో తాపీ పట్టి కార్మికులు పనిచేయనిదే ఏ నిర్మాణమూ సాధ్యం కాదని, అలాంటి కార్మికుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు, తాపీ మేస్త్రీలకు న్యాయం జరిగే వరకు వారి పోరాటానికి బీసీ ఐక్యవేదిక అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు కొయ్యడా వెంకటేష్, మేస్త్రీల సంఘం అధ్యక్షులు చెన్నపురం యాదయ్య, ఆ సంఘ ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, కోశాధికారి కోట్ల చెన్నారెడ్డి, బీసీ ఐక్యవేదిక నాయకులు, కోశాధికారి రేగోటి సురేష్, కార్యదర్శి మల్లేష్, నాగరాజ్ ఆచారి, రాజు యాదవ్, ప్రచార కార్యదర్శి రామ్ బ్రహ్మాచారి తదితరులు పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు.

# కాళ్ల బేరానికి టర్కీ...

**న్యూఢిల్లీ, జూన్ 10 :** టర్కీ మొన్నటి దాకా పాకిస్తాన్ కు వంత పాడింది. అంతటి భూకంపం లో కూడా భారత్ సహాయం చేస్తే ఆ విషయాన్ని కూడా మర్చిపోయి.. జమ్ము కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ ను విపరీతంగా సపోర్ట్ చేసింది. అంతర్జాతీయ వేదికలలో పాకిస్థాన్ దేశాన్ని వెనకేసుకొచ్చింది. మన దేశం మీద లేనిపోని విమర్శలు చేసింది. వీటన్నిటినీ కూడా భారత్ నిశ్శబ్దంగా చూస్తూ ఉండిపోయింది. టర్కీ మాదిరిగా అరవలేదు.. అంతర్జాతీయ వేదికల మీద మాట్లాడలేదు.భారత్ మీద ఇష్టానుసారంగా మాట్లాడి.. పాకిస్తాన్ దేశానికి వంత పాడిన టర్కీకి ఇప్పుడు అసలు విషయం అర్థమవుతోంది. మధ్య ఆసియాలో యుద్ధాలు.. ఆర్థికంగా ఒత్తిడి.. పర్యాటక రంగంపై తీవ్రమైన ప్రభావం.. ఇవన్నీ కూడా టర్కీ దేశాన్ని తీవ్రమైన ఆలోచనలో పడేశాయి. ఇన్నాళ్లపాటు భారతదేశంతో విరోధం కొనసాగించిన టర్కీ ఇప్పుడు ఆకస్మాత్తుగా స్నేహం గుర్తుకొచ్చింది. అందువల్లే భారతదేశంతో మిత్రమా రా.. నాతో చేతులు కలుపు అన్నట్టుగా సంకేతాలు ఇస్తుంది. అయితే దీనిని భారత్ సరిగా పట్టించుకోవడం లేదు. టర్కీ బుద్ధి వచ్చేలా చేసేందుకు భారతదేశం గట్టిగా అరవలేదు.. ప్రపంచ వేదికల ముందు పిచ్చిపిచ్చిగా మాట్లాడలేదు. కేవలం లెక్కలు మాత్రమే వేసింది. ఆ లెక్కలు టర్కీ మొత్తాన్ని కదిలించాయి. లేని భూకంపాన్ని తెప్పించాయి. దీంతో టర్కీ కి ఇండియా అంటే ఏంటి.. నరేంద్ర మోడీ అంటే ఏంటో తెలిసింది. అందువల్లే కాళ్ళ బేరానికి వచ్చింది.చైనాలో యుగర్ ముస్లింల మీద దాడి చేస్తుంటే టర్కీ మాట్లాడలేదు. ఇరాన్, యెామన్, ఇరాక్ దేశాలలో ముస్లింలు చనిపోతుంటే టర్కీ మాట్లాడలేదు. కానీ కాశ్మీర్ విషయంలో మాత్రం గొంతు సవరించుకుంది. భారతదేశం మీద విష ప్రచారం చేసింది. భారత్ సైలెంట్ గా ఆర్మీనియా వైపు నడిచింది. సైప్రస్ మీద దృష్టి సారించింది. అంతేకాదు అత్యంత ఆధునికమైన ఆయుధాలను ఈ రెండు దేశాలకు ఇచ్చేందుకు సిద్ధమైంది. దీంతో భారత్ తనకు తెలియకుండానే తనకింద మంట పెడుతుందని టర్కీ కి అర్థమైంది. అందువల్లే ఇన్నాళ్లపాటు సాగించిన విరోధాన్ని.. శత్రుత్వాన్ని మర్చిపోయింది. స్నేహ హస్తాన్ని చాచింది.టర్కీని భారత్ నమ్మదు. అంతటి భూకంపం వచ్చినప్పుడు ప్రపంచ దేశాలు నిశ్శబ్దంగా ఉన్నప్పుడు భారత్ మాత్రమే టర్కీలో సహాయం చేసింది. మందుల నుంచి మొదలుపెడితే ఆహారం వరకు సరఫరా చేసింది. ఇవన్నీ మర్చిపోయి టర్కీ పాకిస్తాన్ దేశానికి జై కొట్టింది. దీనిని మనసులో పెట్టుకున్న భారత్ ఆర్మీనియా, గ్రీస్, సైప్రస్ దేశాలతో మాట్లాడింది. డిఫెన్స్ సహకారం పెంచింది.. ఫలితంగా టర్కీకి దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది.ఆకాష్ యాంటీ మిస్సైల్ సిస్టమ్స్.. ఫినాక రాకెట్ లాంచర్స్.. స్వాతి రాడార్లు.. బ్రహ్మోస్.. ప్రళయ్ మిస్సైల్స్.. ఇవన్నీ కూడా ఇచ్చేస్తోంది. దీంతో టర్కీ అన్ని మూసుకుంది. నాతో కలువు అంటూ భారతదేశానికి సంకేతాలు పంపిస్తోంది. టర్కీ మాటలు భారత్ వింటుందా నెవర్.. ఎందుకంటే ఆ దేశం పాము లాంటిది.. పాలు పోసినా సరే విషమే చిమ్ముతుంది.

# టార్గెట్ బీఆర్ఎస్



**హైదరాబాద్, జూన్ 10 :** తెలంగాణ రాజకీయాల్లో ఇటీవల ఒక స్పష్టమైన మార్పు గమనించవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ విమర్శల పంథాను పూర్తిగా మార్చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన శత్రువుగా ఉన్న బీఆర్ఎస్, దాని అధినేత కేసీఆర్‌లను టార్గెట్ గా చేసుకుని ఆయన విరుచుకుపడేవారు. కానీ ఇప్పుడాయన రూట్ మార్చారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. ఎక్కడ బహిరంగ సభ జరిగినా కిషన్ రెడ్డి లక్ష్యంగా ఆయన ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. "ఈ నెల 15వ తేదీ తర్వాత కిషన్ రెడ్డి సంగతి చూస్తాం" అంటూ సీఎం రేవంత్ రెడ్డి విసిరిన తాజా సవాల్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.అసలు రేవంత్ రెడ్డి కేసీఆర్‌ను కాదని, కిషన్ రెడ్డిని ఎందుకు టార్గెట్ చేసుకుంటున్నారనేదానిపై ఆరా తీస్తే.. దీని వెనుక అనేక వ్యూహాలు దాగి ఉన్నట్టు అర్థమవుతోంది. తెలంగాణలో ప్రాంతీయ పార్టీగా ఉన్న బీఆర్ఎస్‌ను పూర్తిగా నిస్తేజం చేసి మూడో స్థానానికి పరిమితం చేయడమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం. రాష్ట్రంలో ప్రధాన పోటీ కేవలం జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల మధ్యే ఉందనే వాతావరణాన్ని కల్పించడం ద్వారా, రాబోయే ఎన్నికల నాటికి ద్విముఖ పోరు జరిగేలా రేవంత్ రెడ్డి పావులు కదుపుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం, ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో బీఆర్ఎస్ క్యాడర్, ఓటు బ్యాంక్ బలహీనపడింది. ఈ తరుణంలో బీఆర్ఎస్‌ను ఇంకా టార్గెట్ చేయడం వల్ల ఆ పార్టీకి అనవసర మైలేజ్ ఇచ్చినట్లవుతుందని రేవంత్ భావిస్తున్నారు. అందుకే బీజేపీని ప్రధాన ప్రత్యర్థిగా నిలబెడుతున్నారు.క్షేత్రస్థాయిలో బలపడుతున్నట్లు కనిపిస్తున్న బీజేపీని ప్రధాన శత్రువుగా చూపించడం వెనుక పెద్ద ఓటు బ్యాంక్ వ్యూహం ఉంది. రాష్ట్రంలో బీజేపీని వీలైనంతగా టార్గెట్ చేయడం ద్వారా యాంటీ బీజేపీ ఓట్లన్నీ ముఖ్యంగా మైనారిటీలు, దళితులు, వెనుకబడిన వర్గాల ఓట్లు చీలిపోకుండా ఏకపక్షంగా కాంగ్రెస్ వైపు ఏకీకృతం అవుతాయని రేవంత్ రెడ్డి అంచనా వేస్తున్నారు. మైనారిటీ ఓటర్లలో బీఆర్ఎస్‌పై నమ్మకం తగ్గితే, ఆ ఓట్లు కాంగ్రెస్‌కే పడాలంటే బీజేపీని పెద్ద శత్రువుగా చూపించడం రేవంత్‌కు అత్యంత అవసరం.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని టార్గెట్ చేయడం ద్వారా రేవంత్ రెడ్డి తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ తెరపైకి తెస్తున్నారు. మోదీ గుజరాత్‌లో సబర్మతి నదిని అభివృద్ధి చేసుకుంటే ఆహా ఓహో అనే కిషన్ రెడ్డి, తాము మూసీ నదిని ప్రక్షాళన చేస్తామంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించడం వెనుక ప్రాంతీయ సెంటిమెంట్‌ను రచ్చకెక్కించే వ్యూహం ఉంది. చేవెళ్ల, మెదక్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్ ఎంపీలుగా బీజేపీ నేతలే ఉన్నా.. కేంద్రం నుండి రాష్ట్రానికి నిధులు తేవడంలో వారు విఫలమయ్యారని ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా, బీజేపీని బలహీనపరచాలని రేవంత్ చూస్తున్నారు.దీనికి కౌంటర్‌గా బీజేపీ సైతం రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నేరుగా ఢీకొట్టడానికే మొగ్గు చూపుతోంది. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలను, కేంద్ర పెద్దలతో ఆయన జరిపే భేటీలను కిషన్ రెడ్డి క్షుణ్ణంగా గమనిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. తాము కూడా బీఆర్ఎస్‌ను పక్కన పెట్టి, కేవలం కాంగ్రెస్ వైఫల్యాలనే ఎండగట్టడం ద్వారా తెలంగాణలో తామే ప్రత్యామ్నాయ శక్తి అని నిరూపించుకోవాలని బీజేపీ భావిస్తోంది. అంటే, ఉభయ పక్షాలు పరస్పరం లబ్ధి పొందేలా, బీఆర్ఎస్ ఉనికిని క్రమంగా తుడిచిపెట్టేలా ఈ ద్విముఖ పోరు వ్యూహానికి ఇరు పార్టీలూ సహకరించుకుంటున్నాయనే భావన వ్యక్తమవుతోంది.సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ఈ సరికొత్త రాజకీయ వ్యూహం తెలంగాణను భవిష్యత్తులో కేవలం రెండు జాతీయ పార్టీల రణరంగంగా మార్చబోతోంది. రాబోయే 24 నెలల కాలం అభివృద్ధిపైనే దృష్టి పెడతామని చెబుతూనే, రాజకీయంగా ప్రత్యర్థులను కోలుకోకుండా చేయడం రేవంత్ మార్క్ పాలిటిక్స్ కు నిదర్శనం.

# టాప్ సెలబ్రిటీ లిస్ట్ లో విరాట్

**ముంబై, జూన్ 10:** దేశంలో ఎంతో మంది సెలబ్రిటీలు ఉన్నారు. క్రీడలు, సినిమాలు, వ్యాపారం, వ్యవసాయం, కళలు ఇలా అనేక రంగాల నుంచి అనేక మంది ప్రముఖ స్థానాల్లో ఉన్నారు. అయితే దేశంలో విలువైన సెలబ్రిటీ ఎవరు అన్నది వారి ఆదాయం ఆధారంగా ఉంటుంది. దీనిని గుర్తించేందుకు ఫార్చ్యూన్ ఇండియా ఇంటర్‌బ్రాండ్‌తో కలిసి తొలిసారిగా చేపట్టిన 'ఇండియా'స్ మోస్ట్ వాల్యూబుల్ సెలబ్రిటీస్' స్టడీలో విరాట్ కోహ్లీ అగ్రస్థానం సాధించారు. అతని బ్రాండ్ వాల్యూ రూ.3,542 కోట్లుగా నిర్ధారణ అయింది. ఇది ఎంతగా అనుసరిస్తారు, ఏ స్టార్ బ్రాండ్లకు నిజమైన విలువనిస్తారు అనేది స్పష్టంగా చెప్పే ఒక మైలురాయి.

కోహ్లీ టాప్..

క్రికెటర్ విరాట్ కోహ్లీ సాధించిన ఈ స్థానం ఆయన క్రికెట్ ప్రదర్శన మాత్రమే కాదు. అతని ఫిట్‌నెస్ జీవనశైలి, స్థిరత్వం, గ్లోబల్ అప్పీల్, సోషల్ మీడియా ప్రభావం (270 మిలియన్ ఫాలోవర్లు), ప్రీమియం బ్రాండ్లతో దీర్ఘకాలిక సంబంధాలు ఇవన్నీ కలిసి అతన్ని భారతదేశ అత్యంత శక్తివంతమైన బ్రాండ్‌గా నిలిపాయి. ఇంటర్‌బ్రాండ్ పద్ధతిలో బ్రాండ్ వాల్యూను నిర్ణయించేటప్పుడు కేవలం పాపులారిటీ లేదా ఆదాయం మాత్రమే కాకుండా డిస్టినెక్టివ్‌నెస్, రిలవెన్స్, ఎంగేజ్‌మెంట్, ట్రస్ట్, రెస్పాన్సిబిలిటీ వంటి అంశాలను కూడా పరిగణించారు. ఈ అన్ని పారామీటర్లలోనూ కోహ్లీ టాప్‌లో నిలిచారు.

1. విరాట్ కోహ్లీ
2. షారుఖ్ ఖాన్
3. ప్రియాంక చోప్రా జోనాస్
4. మహేంద్ర సింగ్ ధోనీ
5. రణవీర్ సింగ్
6. అక్షయ్ కుమార్
7. అమితాబ్ బచ్చన్
8. సచిన్ తెండుల్కర్
9. ఆలియా భట్
10. అల్లు అర్జున్
11. దీపికా పదుకొణె
17. రష్మిక మందన్న

టాప్‌లో క్రికెటర్లు?

టాప్?10లో మూడు స్థానాలు (కోహ్లీ, ధోనీ, సచిన్) క్రికెటర్లది కావడం భారతదేశంలో క్రికెట్‌పై ఉన్న అపారమైన ఆధారణ, సామాజిక?ఆర్థిక ప్రభావాన్ని మరోసారి నిరూపిస్తోంది. బాలీవుడ్ సూపర్‌స్టార్ల కంటే క్రికెట్ ఐకాన్లు బ్రాండ్‌గా ఎక్కువ విలువనిస్తున్నారు.

బలంగా బాలీవుడ్

బాలీవుడ్ ఇంకా బలంగానే ఉంది, కానీ సవాళ్లు ఎదుర్కొంటోంది. షారుఖ్, ప్రియాంక, రణవీర్, అక్షయ్, అమితాబ్, ఆలియా వంటి స్టార్లు టాప్?10లో స్థానం సంపాదించడం బాలీవుడ్ ఇప్పటికీ బలమైన బ్రాండ్ శక్తిని కలిగి ఉందని చెబుతోంది. ముఖ్యంగా ప్రియాంక గ్లోబల్ ఇమేజ్ ఆమెను మూడో స్థానానికి చేర్చింది.అల్లు అర్జున్ 10వ స్థానం, రష్మిక మందన్న 17వ స్థానం సాధించడం దక్షిణ భారత సినిమా (ముఖ్యంగా తెలుగు?కన్నడ) జాతీయ స్థాయి ప్రభావాన్ని సూచిస్తోంది. ఇది భారతదేశ ఎంటర్‌టైన్‌మెంట్ ల్యాండ్‌స్కేప్ మారుతోందని తెలియజేస్తుంది.ఫార్చ్యూన్?ఇంటర్‌బ్రాండ్ స్టడీ భారతదేశంలో సెలబ్రిటీ బ్రాండ్ వాల్యూ ఎలా కొలవాలో ఒక ప్రమాణాన్ని నిర్దేశించింది. విరాట్ కోహ్లీ ఈ జాబితాలో అగ్రస్థానం సాధించడం ద్వారా ఒక విషయం స్పష్టమవుతోంది. ఇక్కడ నిజమైన బ్రాండ్ వాల్యూ కేవలం పాపులారిటీ లేదా ఫాలోవర్ల సంఖ్యపై మాత్రమే ఆధారపడదు. అది స్థిరత్వం, విశ్వసనీయత, సామాజిక ప్రభావం, ఆధునిక భారతీయ యువత ఆశించే విలువలపై ఆధారపడి ఉంటుంది.

# ప్రమాదంలోనూ... రాజకీయమా

**విశాఖపట్టణం,జూన్ 10 :** స్వతంత్ర దేశంలో చావు కూడా పెళ్లిలాంటిదే అన్నట్టుగా వైసీపీ నాయకులకు ఎక్కడ ఎలా వ్యవహరించాలో తెలియడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం జరిగి 8 మంది మృతి చెందిన విషయం రాష్ట్ర వ్యాప్తంగా అందరినీ కలిచి వేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన మంత్రి నారా లోకేష్.. వారిలో భరోసా నింపే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.కానీ.. దీనిని కూడా వైసీపీ నాయకులు రాజకీయాలకు వాడేసుకునే ప్రయత్నం చేయడం గమనార్హం. వాస్తవానికి ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అందరూ కలివిడిగా వ్యవహరించి..బాధితులకు అండగా.. వారికి భరోసా కల్పించేలా వ్యవహరించాలి. కానీ, దీనికి భిన్నంగా వైసీపీ నాయకులు నారా లోకేష్ పర్యటనపై విమర్శలు చేశారు. బాధిత కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ప్రకటించాలన్న కార్మిక సంఘాలను నారా లోకేష్ ఏదో అన్నారని.. లోకేష్ నియంతలా వ్యవహరిస్తున్నారని వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యానించారు.వాస్తవానికి కార్మికుల పక్షాన, ఉద్యోగుల పక్షాన, మరీ ముఖ్యంగా బాధితుల పక్షాన నిలబడడాన్ని ఎవరూ తప్పు బట్టరు. ప్రభుత్వాన్ని ప్రశ్నించవద్దని కూడా ఎవరూ అనరు. అంతేకాదు.. బాధితులకు సాధ్యమైనంత ఎక్కువ మొత్తంలో పరిహారం ఇప్పించే ప్రయత్నం చేయడాన్ని కూడా ఎవరూ తప్పుగా చూడరు. వైసీపీ స్థానంలో టీడీపీ ఉన్నా.. బాధితుల పక్షానే నిలబడుతుంది. కానీ.. దీనికి కూడా సమయం, సందర్భం అంటూ ఒకటి ఉంటుంది. విశాఖ ప్లాంట్ ఘటనలో తప్పు ప్రభుత్వానిదా? అంటే కాదు.ఇది ప్రమాదవశాత్తు జరిగిందని సాక్షాత్తూ కేంద్ర మంత్రే చెప్పారు. పోనీ.. ఈఘటన.. ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనల కారణంగా జరిగిందా? అంటే.. దీనికి రాష్ట్ర సర్కారుకు సంబంధం లేదు. అయినప్పటికీ.. ఈ ఘటనను ప్రభుత్వానికి, ముఖ్యంగా మంత్రి లోకేష్‌కు ముడిపెట్టి.. గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యలు చేయడం.. బాధితులను పరామర్శించడాన్ని కూడా తప్పుపట్టేలా మాట్లాడడం వంటివి సరికాదని అంటున్నారుఏదైనా ఉంటే.. సమయం చూసుకుని ప్రభుత్వానికి సూచనలు చేయొచ్చని.. ప్రతిపక్ష(ప్రధానకాదు) పార్టీగా వైసీపీ తరఫున కూడా బాధితులను ఆదుకునేందుకు ప్రయత్నించవచ్చని చెబుతున్నారు. కానీ, ఈ బాధ్యతలను మరిచిన గుడివాడ.. మీడియా సమావేశాలు పెట్టి మంత్రిని విమర్శించడమే పనిగా పెట్టుకోవడంపై విశాఖ వాసులే.. నవ్విపోతున్నారు

టీడీపీ, జనసేన

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు.. కూటమి ప్రభుత్వంలో కీలక రోల్ పోషిస్తున్న విషయం తెలిసిందే. జనసేన పార్టీ అధినేతగా పవన్ కల్యాణ్, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా



నారా లోకేష్ వ్యవహరిస్తున్నారు. తాజాగా తొలిసారి ఒకే సమయంలో ఇద్దరు నేతలుకూడా విశాఖలో పర్యటించారు. సోమవారం సాయంత్రం విశాఖలోని స్టీల్‌ప్లాంట్ జరిగిన ఘోర ప్రమాదంలో 8 మంది మృతి చెందడం తో పాటుపలువురు గాయపడ్డారు. వీరిని పరామర్శించేందుకు ఇరువురు నాయకులు విశాఖలో పర్యటించారు.రష్యా పర్యటనకు వెళ్లిన.. మంత్రి నారా లోకేష్.. ఈ రోజు ఉదయమే.. హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో ఆయన విదేశీ పర్యటన బడలికతో మంగళవారం రెస్ట్ తీసుకోవాలని, కుటుంబ సభ్యులతో గడపాలని అనుకున్నారు. కానీ, విశాఖలో జరిగిన దుర్ఘటనతో ఆయన ఉదయం 10 గంటలకే హైదరాబాద్ నుంచి నేరుగా విశాఖకు చేరుకున్నారు. ఇక, జనసేన అధినేత పవన్ కల్యాణ్.. కూడా మంగళగిరి నుంచి నేరుగా విశాఖకు చేరుకుని.. బాధితులను పరామర్శించారు.విశాఖ స్టీల్ ప్లాంట్ బాధితుల పరామర్శకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు వచ్చినా.. ఇద్దరూ ఎలాంటి గందరగోళానికి తావివ్వకుండా.. పనిని పంచుకున్నట్టు స్పష్టమైంది. మంత్రి లోకేష్.. నేరుగా ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లారు. వారితో మాట్లాడి.. ఓదార్చారు. వారితో కలిసి కూర్చుని వారి బాధను పంచుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం నూరిపోశారు.ఇక, పవన్ కల్యాణ్.. మంగళగిరి నుంచి నేరుగా విశాఖకు చేరుకున్నా.. అక్కడి నుంచి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లారు. వారిని పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యాన్ని, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులతో నేరుగా మాట్లాడి వారి నుంచి కొంత సమాచారం తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు.ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. కాగా.. ఇరువురు నేతలు.. వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. నిజానికి ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు నాన్ ప్లాన్‌గా వ్యవహరించే పరిస్థితి ఉంటుంది. కానీ, పవన్, లోకేష్‌లు బాధితుల పరామర్శలో భాగం అయ్యే విషయంలో జాగ్రత్తలు తీసుకుని విమర్శలకు తావులేకుండా వ్యవహరించారు.

# రేవంత్ దిమ్మతిరిగే రాజకీయ వ్యూహం...

హైదరాబాద్,**జూన్ 10 :** తెలంగాణ రాజకీయ యవనికపై ఇప్పుడు రేవంత్ రెడ్డి సాహసం సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది. ప్రాంతీయ విభేదాల కుంపట్ల మధ్య, సీమాంధ్ర పాలకులపైన, ఆంధ్రా మూలాలపైన ఒక వర్గం విపరీతమైన ద్వేషాన్ని నూరిపోస్తున్న వేళ.. హైదరాబాద్ నడిబొడ్డున, అమీర్‌పేట చౌరస్తాలో తెలుగుజాతి గర్వించదగ్గ మహానాయకుడు నందమూరి తారకరామారావు విగ్రహం కొలువుదీరింది. రేవంత్ రెడ్డి విమర్శల తుపానులను లెక్కచేయకుండా, స్వపక్షంలోని సొంత గొంతుల అభ్యంతరాలను తొక్కుకుంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విగ్రహాన్ని ఆవిష్కరించి తనేంటో, తన దమ్ము ఏంటో మరోసారి నిరూపించుకున్నారు. ఇది కేవలం ఒక విగ్రహావిష్కరణ కాదు.. తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసే రేవంత్ మార్క్ రాజకీయ చాణక్యం.కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా ఉంటూ, ఒకప్పటి ప్రత్యర్థి పార్టీ తెలుగుదేశం వ్యవస్థాపకుడి విగ్రహాన్ని ఆవిష్కరించడం అంటే సామాన్యమైన విషయం కాదు. దీనిపై రాజకీయంగా ఎన్నో విమర్శలు, మరెన్నో అపోహలు సృష్టించే ప్రయత్నం జరిగింది. కానీ, రేవంత్ రెడ్డి వాటన్నింటినీ తనదైన శైలిలో తిప్పికొట్టారు. ఎన్టీఆర్‌ను ఏ ఒక్క ప్రాంతానికో, కులానికో పరిమితం చేయడం అజ్ఞానమే అవుతుందని చాటిచెప్పారు.సమాజంలో అణగారిన వర్గాల కోసం పోరాడిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, పేదల పాలిట పెన్నిధిగా నిలిచిన ఇందిరా గాంధీ సరసన ఎన్టీఆర్‌ను నిలబెట్టి.. ఆయన నిరుపేదల పక్షపాతి అని నినదించారు. అన్నగారు తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక అని, ఆయన్ను ప్రాంతీయ సంకెళ్లతో బంధించలేమని రేవంత్ రెడ్డి భావోద్వేగంగా ప్రకటించిన తీరు.. అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరి గుండెలను తాకింది.ఈ వేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై, ముఖ్యంగా కేసీఆర్‌పై సంధించిన విమర్శనాస్త్రాలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఎన్టీఆర్ పెట్టిన రాజకీయ భిక్షతో, ఆయన కాళ్ల చెంత రాజకీయ ఓనమాలు నేర్చుకుని, ఈ రోజు ఆ స్థాయికి చేరిన కేసీఆర్ వంటి నాయకులు.. ఇప్పుడు అదే ఎన్టీఆర్‌ను, ఆయన వారసత్వాన్ని విమర్శించడాన్ని రేవంత్ తీవ్రంగా తప్పుబట్టారు. ఎదిగిన కొద్దీ ఒదగాల్సింది పోయి, రాజకీయ జన్మనిచ్చిన నాయకుడినే విస్మరించడం, విమర్శించడం ద్రోహమే అవుతుందన్నారు. తెలంగాణ సమాజంలో కృతజ్ఞతకు, ద్రోహానికి మధ్య ఉన్న తేడాను కళ్లకు కట్టింది. అధికార దాహంతో చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేసిన వారికి ఈ విగ్రహావిష్కరణ ఒక గట్టి చెంపపెట్టుగా నిలిచింది.ఈ విగ్రహావిష్కరణ వెనుక రేవంత్ రెడ్డి కేవలం భావోద్వేగాన్నే నమ్ముకోలేదు.. అత్యంత పదునైన, వ్యూహాత్మక రాజకీయ చాణక్యాన్ని ప్రదర్శించారు. తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో ఉన్న లక్షలాది మంది తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులను, నందమూరి అభిమానులను కాంగ్రెస్ వైపు తిప్పుకునేలా ఈ సందర్భాన్ని ఆయన మలుచుకున్నారుప్రాంతీయ విభేదాలను పక్కనబెట్టి, తెలుగు వారందరినీ ఒకే తాటిపైకి తెచ్చే మహా నాయకుడిగా తనను తాను ఆవిష్కరించుకున్నారు. అటు సీమాంధ్ర ఓటర్లలో నమ్మకాన్ని పెంచుతూనే, ఇటు తెలంగాణ ఆత్మగౌరవానికి తానే నిజమైన వారసుడినని నిరూపించుకున్నారు. వ్యూహాత్మకంగా ప్రత్యర్థుల నోళ్లు మూయించడంలో రేవంత్ రెడ్డి ఎంతటి సమర్థుడో ఈ ఘటనే సాక్ష్యంసవాళ్లకు ఎదురువెళ్లడం రేవంత్ రెడ్డి నైజం. విమర్శలు వస్తాయని తెలిసి కూడా, అమీర్‌పేట సాక్షిగా అన్నగారి విగ్రహాన్ని నిలబెట్టి, తెలుగుజాతి గుండెల్లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నారు. భావోద్వేగాలను రగిలిస్తూనే.. లౌక్యంతో, ధైర్యంతో రేవంత్ రెడ్డి వేసిన ఈ అడుగు తెలంగాణ రాజకీయాల్లో సుదీర్ఘకాలం పాటు నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇది దమ్మున్న నాయకుడి.. దిమ్మతిరిగే రాజకీయ వ్యూహం

# పంచాయితీలకు నిధుల వరదేనా

**మెదక్, జూన్ 10 :** గ్రామపంచాయతీలు ఆర్థికంగా బలంగా ఉంటేనే దేశం బాగుంటుంది. ఎందుకంటే మన దేశానికి పల్లెలే పట్టు కొమ్మలు కాబట్టి. దురదృష్టవశాత్తు గ్రామీణ ప్రాంతాలను ఇప్పటికి ప్రభుత్వాలు కేవలం ఆదాయం వచ్చే వనరులుగానే చూస్తున్నాయి. ఆదాయాన్ని తీసుకొని అంతంతమాత్రంగా కేటాయింపులు జరుపుతూ.. అభివృద్ధి విషయంలో శీత కన్ను ప్రదర్శిస్తున్నాయి. అందువల్లే గ్రామాలు అభివృద్ధికి నోచుకోకుండా పోతున్నాయి. తెలంగాణలో గడచిన పది సంవత్సరాల కాలంలో గ్రామపంచాయతీలపై భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం విపరీతమైన పెత్తనం సాగించింది. కేంద్ర ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు వెళ్లకుండా అడ్డుకట్ట వేసింది. దీంతో పంచాయతీలలో బకాయిలు పేరుకుపోయాయి.పంచాయతీల మీద ట్రాక్టర్లు.. ఇతర ఖర్చులను వేయడంతో.. బకాయిలు గుదిబండ లాగా మారిపోయాయి. దీంతో కనీసం పంచాయతీలలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. వచ్చే ఆదాయం మీద హక్కు లేకుండా పోయింది. ఫలితంగా ఎప్పుడో ఒకసారి కార్మికులకు వేతనాలు ఇస్తున్న దుస్థితి ఏర్పడింది. బకాయిలు పెరిగిపోవడం.. ఆర్థిక వృద్ధి లేకపోవడంతో పంచాయతీలు తీవ్రంగా ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. ఇటువంటి స్థితిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీరాజ్ చరిత్రలోనే సరికొత్త విధానాలకు శ్రీకారం చుట్టారు.ఇకపై వచ్చే ఆదాయాన్ని పంచాయతీ బ్యాంకు ఖాతాలలో వేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఖజానా లో వేసి తీసుకునే పద్ధతి ఉండదు. ఈ మేరకు పంచాయతీరాజ్ చట్టాన్ని సవరిస్తున్నారు. పంచాయతీలలో పనిచేసే సిబ్బందికి ఒకటవ తేదీన వేతనాలు వస్తాయి. రేవంత్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల పంచాయతీలలో పనిచేస్తున్న యాభై వేల మందికి ఊరట లభిస్తుంది. ఇకపై ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతినెల 50 కోట్ల వరకు పంచాయతీలకు వెళ్తాయి.గత ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థలను మొత్తం నిర్వీర్యం చేసేందుకు ట్రెజరీ విధానాన్ని తీసుకొచ్చింది. దీనిని మార్చేందుకు తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లో సెక్షన్ 70 (3) ని పూర్తిగా సవరించారు. దీనివల్ల ట్రెజరీలో పంచాయతీ ఆదాయాన్ని వేయాల్సిన అవసరం లేదు. పంచాయతీల పేరు మీద ఉన్న బ్యాంకు ఖాతాలో వేసి తీసుకోవచ్చు. వేతనాలు.. ఇతర చెల్లింపులకు వాడుకోవచ్చు. అయితే ఇవన్నీ కూడా ఆడిట్ పరిధిలో ఉంటాయి. ప్రతి పైసా కూడా జాగ్రత్తగా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది.మరోవైపు కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్ల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదు. కేంద్రం ఇచ్చే నిధులు మొత్తం నేరుగా పంచాయతీలకే మంజూరు చేస్తుంది. ప్రభుత్వం కూడా తన వాటాగా డబ్బులు ఇస్తోంది. దీనివల్ల స్థానిక సంస్థలు బలోపేతమవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. పంచాయతీలలో పనిచేసే కార్మికులకు అంతంత మాత్రం గానే వేతనాలు ఉంటాయి. ఆ వేతనాలు పకడ్బందీగా వస్తేనే వారి అవసరాలు తీరుతాయి. ఆ విషయాన్ని గుర్తించిన రేవంత్ రెడ్డి పంచాయతీ రాజ్ చట్టంలో పూర్తిగా మార్పులు తీసుకొచ్చారు. దీనివల్ల ఉద్యోగులకు వేతనాలు మాత్రమే కాదు.. పంచాయతీ కూడా ఆర్థికంగా బలోపేతం అవుతాయి. అతి త్వరలోనే నూతన విధి విధానాలు అమలవుతాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియ...
# యాక్టివ్ అవుతున్న బూత్ లెవల్ కమిటీలు

**హైదరాబాద్, విజయవాడ, జూన్ 10 :** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది. ఈ ప్రక్రియ ప్రారంభం కావడంతోనే అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ తీవ్ర అప్రమత్తమయ్యాయి. తమ సానుభూతిపరుల ఓట్లు ఎక్కడైనా గంపగుత్తగా తొలగిపోతాయేమోననే భయంతో అన్ని రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో తమ బూత్ లెవెల్ ఏజెంట్ల ను రంగంలోకి దించాయి. ఎన్నికల సంఘం సాధారణంగా ప్రతి ఏటా ఓటర్ల జాబితా సవరణ చేపడుతుంది. కానీ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది చాలా ప్రత్యేకమైనది. ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారులు నేరుగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఒకే ఇంట్లో పదుల సంఖ్యలో ఓట్లు ఉండటం, చనిపోయిన వారి ఓట్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు, ఒకే ఓటరుకు రెండు మూడు చోట్ల ఉన్న డబుల్ ఓట్లను గుర్తించి జాబితా నుండి పూర్తిగా తొలగిస్తారు. అలాగే అర్హులైన కొత్త ఓటర్లను చేర్చుతారు.రాజకీయ పార్టీలకు ఈ ప్రక్రియ ఒక పెద్ద పరీక్ష లాంటిది. ఒక నియోజకవర్గంలో గెలుపోటములను కొన్ని వందల లేదా వేల ఓట్లు నిర్ణయిస్తుంటాయి. ఈ తీవ్రమైన ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో.. స్థానిక అధికారులు పొరపాటునో లేదా ఏకపక్షంగానో తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లను వలస వెళ్లారు లేదా చిరునామా లేదు అనే నెపంతో తొలగిస్తే.. ఆ నష్టం పూడ్చలేనిది అవుతుంది. అందుకే ఓట్లు తగ్గిపోకూడదని, తమ క్యాడర్ ఓట్లు గల్లంతు కాకూడదని పార్టీలు విపరీతమైన టెన్షన్ పడుతుంటాయి.ఈ పరిస్థితిని తట్టుకోవడానికి ప్రతి పార్టీ తమ బూత్ లెవెల్ ఏజెంట్ల ను అప్రమత్తం చేస్తున్నాయి. ప్రభుత్వ బూత్ లెవెల్ అధికారి ఇంటింటికీ తిరిగేటప్పుడు.. ఈ పార్టీ బీఎల్ఏలు కూడా వారితో పాటు తిరిగి, ఏ ఒక్క సానుభూతిపరుడి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాపలా కాస్తారు. ఒకవేళ ప్రతిపక్ష ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులుంటే చనిపోయిన వారివి, డబుల్ ఓట్లు వాటిని తొలగించాలంటూ ఫామ్-7 ద్వారా అధికారులపై ఒత్తిడి తెస్తుంటారు. డిజిటల్ డేటా ద్వారా ఈ ప్రక్రియను పార్టీల ఐటీ విభాగాలు కూడా నిశితంగా గమనిస్తున్నాయి.సాంకేతికంగా ఓటు పోతే మళ్లీ చేర్పించుకోవడానికి ఫామ్-6 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. కానీ, ప్రాక్టికల్‌గా అది చాలా కష్టతరమైన ప్రక్రియ. ఒకసారి ఇంటెన్సివ్ రివిజన్ పూర్తయి, ఫైనల్ రోల్ విడుదలయ్యాక.. మళ్లీ ఓటు చేర్పించాలంటే సదరు ఓటరు వ్యక్తిగతంగా ఆసక్తి చూపించాలి. సాధారణంగా సాధారణ ఓటర్లు అంత శ్రద్ధ తీసుకోరు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి వేలాది మంది ఓట్లు పోయాయని గ్రహించినా.. అప్పటికప్పుడు లక్షలాది ఓట్లను తిరిగి చేర్పించడం ఏ రాజకీయ పార్టీకైనా అసాధ్యమైన టాస్క్. అందుకే నివారణే మేలు అన్నట్లు ముందే అలర్ట్ అవుతారు.ఇక్కడ అసలు ట్విస్ట్ ఉంది. సిద్ధాంతపరంగా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా కావాలని అన్ని పార్టీలు పైకి చెప్తాయి. కానీ, క్షేత్రస్థాయి ప్రాక్టికల్ రాజకీయాల్లో ఏ పార్టీకి కూడా వంద శాతం క్లీన్ లిస్ట్ ఇష్టం ఉండదు. ఎందుకంటే, ప్రతి నియోజకవర్గంలోనూ దొంగ ఓట్లు , డబుల్ ఓట్లు లేదా చనిపోయిన వారి ఓట్లు తమకు అనుకూలంగా పోల్ అవుతాయని స్థానిక లీడర్లు నమ్ముతారు. తమకు అనుకూలమైన దొంగ ఓట్లను కాపాడుకుంటూ.. ప్రత్యర్థి పార్టీకి చెందిన నకిలీ ఓట్లను తొలగించాలనే ద్వంద్వ నీతి ని అన్ని పార్టీలు అవలంబిస్తుంటాయి. ఓటర్ల జాబితా అనేది ప్రజాస్వామ్యానికి పునాది. ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా ఎన్నికల సంఘం నకిలీ ఓట్లకు గండి కొట్టాలని చూస్తుంటే.. రాజకీయ పార్టీలు మాత్రం తమ ఓటు బ్యాంకు చెదరకుండా చూసుకునే వ్యూహాల్లో మునిగిపోయాయి. ఈ ప్రక్రియ ముగిసేసరికి ఏ పార్టీ తన బూత్ స్థాయి యంత్రాంగాన్ని సమర్థవంతంగా వాడుకుంటుందో.. ఆ పార్టీ రాబోయే ఎన్నికల్లో ఖచ్చితంగా ముందంజలో ఉంటుంది.

# ఆపరేషన్ లోటస్ ప్రారంభం...



**హైదరాబాద్, జూన్ 10 :** తెలంగాణలో బీజేపీ పుంజుకునే ప్రయత్నంలో పడింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ లను తట్టుకుని తెలంగాణలో ముందుకు రావడం అంత సులువు కాదు. అందుకే రానున్న కాలంలో బీజేపీలో కీలక నేతలను ఆ పార్టీల నుంచి చేర్చుకునే అవకాశముంది. ఇప్పటి నుంచే నియోజకవర్గాల వారీగా తెలంగాణలో బీజేపీ సర్వేలు చేయిస్తుంది. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ గెలుపు గుర్రాలకు మాత్రమే టిక్కెట్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం అవసరమైతే ఇతర పార్టీల నేతలను కూడా ఆహ్వానించి వారికి కండువా కప్పేయాలని డిసైడ్ అయింది. దక్షిణాదిన బలపడాలనుకుంటున్న బీజేపీ తెలంగాణను లక్ష్యంగా చేసుకుంది.వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఎలాగైనా అధికారంలోకి రావాలని భావించి పార్టీ కేంద్ర నాయకత్వం తరచూ రాష్ట్ర నాయకులతో సమావేశమవుతున్నారు. నేతలంతా సమైక్యంగా నిలిచి ఇతర పార్టీల నేతలను ఆహ్వానించేందుకు అవసరమైన స్కెచ్ లను రూపొందించాలని ఇప్పటికే రాష్ట్ర పార్టీ నేతలకు ఆదేశించినట్లు తెలిసింది. తెలంగాణలో గత శాసనసభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను, పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను గెలుచుకున్న సంగతి తెలిసిందే. మరికొంత గట్టిగా ప్రయత్నిస్తే ఈసారి అధికారంలోకి రావడం ఖాయమని అంటున్నారు.బీఆర్ఎస్ లో కీలక నేతలను రప్పించడానికి కూడా కేంద్రం స్థాయిలో నేతలు పావులు కదుపుతున్నారన్న ప్రచారం ఇటీవల కాలంలో ఊపందుకుంది. ఇప్పటికే పార్టీ నాయకత్వంపైన, మరోసారి అధికారంలోకి వస్తామన్న నమ్మకం లేని కొందరు నేతలు బీజేపీ వైపు చూస్తున్నట్లు గుర్తించిన అధినాయకత్వం త్వరలోనే ఆపరేషన్ ను ప్రారంభించే అవకాశాలున్నాయని పార్టీ సీనియర్ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కొందరు నేతలు బీజేపీ టాప్ లీడర్లతో టచ్ లోకి వెళ్లారని, అయితే సర్వే నివేదికలు వచ్చిన తర్వాత మాత్రమే వీరి చేరికలు ఉంటాయని చెబుతున్నారు. మొత్తం మీద తెలంగాణలో బీజేపీ భారీ స్కెచ్ తో ముందుకు వెళుతుంది. మరి చివరకు ఏం జరుగుతుందో చూడాలి.

**నార్త్ తెలంగాణ...**

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బీజేపీ ఒక నిశ్శబ్ద విప్లవానికి తెరలేపింది. గతంలో తాము జెండా పాతిన దుబ్బాక, హుజూరాబాద్‌లతో పాటు ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల గ్రామీణ ప్రాంతాల్లో కాషాయ దళం ప్రయోగించిన హైపర్ లోకల్ గ్రౌండ్ స్ట్రాటజీ ఇప్పుడు రాష్ట్ర రాజకీయ నిపుణులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ప్రత్యర్థుల వ్యూహాలకు చిక్కకుండా, క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంక్ పునాదులను కదిలించేలా బీజేపీ మాస్టర్ ప్లాన్ వేసింది.ప్రస్తుతం తెలంగాణ పల్లెల్లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు, స్థానిక కమిటీల నియామకాలు, పాత సివిల్ వివాదాల చుట్టూ కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈ రెండు పార్టీల గ్రూపు తగాదాలతో విసిగిపోయిన తటస్థ ఓటర్లను, ఏ వర్గంలోనూ చేరలేక ఇబ్బంది పడుతున్న సగటు గ్రామీణ యువతను బీజేపీ చాకచక్యంగా తన వైపు తిప్పుకుంటోంది.స్థానికంగా ఎవరు గెలిచినా పాత కక్షలు తప్పవని.. అదే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో నడిస్తే పొలిటికల్ ప్రొటెక్షన్ ఉంటుందని వివరిస్తోంది. బలమైన భరోసాను ఇస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ కేడర్ నైరాశ్యాన్ని క్యాష్ చేసుకుంటోంది. పెద్దగా ప్రెస్ మీట్లు పెట్టకుండానే, ఊళ్లల్లో ప్రత్యామ్నాయ శక్తులుగా బీజేపీ స్థానిక నాయకత్వం ఎదుగుతోంది.ఉత్తర తెలంగాణ రాజకీయాలను ఎప్పుడూ కుల సమీకరణాలే శాసిస్తాయి. దీనిని పక్కాగా అర్థం చేసుకున్న కాషాయ దళం.. ఈ సారి సరికొత్త సోషల్ ఇంజనీరింగ్‌కు తెరలేపింది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో కింది సామాజిక వర్గాలను టార్గెట్ చేసింది. బలమైన బీసీ సామాజిక వర్గాలైన మున్నూరు కాపు, పద్మశాలి, యాదవ, గౌడ, ముదిరాజ్ సంఘాలతో ప్రత్యేకంగా సమావేశమవుతోంది. దళిత, గిరిజన ఉపకులాల స్థానిక పెద్దలతో చర్చలు జరుపుతోంది.గ్రామంలో ఐదారు కుటుంబాలను లేదా కనీసం 10 ఓట్లను ప్రభావితం చేయగల సామర్థ్యం ఉన్న ఈ కీలక వ్యక్తులను బీజేపీ నేతలు నేరుగా కలిసి మాట్లాడుతున్నారు.

# మారుతోన్న అస్సాం..భాషా సామరస్యం

**గౌహతి,జూన్ 10 :** ఈశాన్య రాష్ట్రం అస్సాం ఎప్పుడూ భాషా సమస్యలకు పర్యాయపదంగా నిలిచింది. బెంగాలీ?అస్సామియా ఘర్షణలు, జనాభా లెక్కల సమయంలో జరిగిన అల్లర్లు, బోడోలాండ్ ఉద్యమం ? ఈ అన్నీ భాషా గుర్తింపు కోసం జరిగిన దీర్ఘకాలిక పోరాటాలు. ఒక్క భాషను ఆధిపత్యం వహింపజేయాలనే ప్రయత్నాలు రాష్ట్రాన్ని రక్తసిక్తం చేశాయి. కానీ 2026 మే 26న జరిగిన ఒక ఘటన ఆ చరిత్రను పూర్తిగా మార్చేసింది. అస్సాం అసెంబ్లీలో 9 భాషల్లో పదవీ ప్రమాణ స్వీకారం జరగడం దేశంలోనే అపూర్వమైన సంఘటన. ఇది కేవలం ఒక ఆడంబరం కాదు.. భాషా వైవిధ్యాన్ని సమస్యగా కాకుండా బలంగా మార్చే రాజకీయ పరిపక్వత.16వ అస్సాం అసెంబ్లీలోని 124 మంది ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. వారు తొమ్మిది భాషల్లో ప్రమాణం చేయడం అస్సాం అసెంబ్లీ చరిత్రలో మొదటిసారి 124 మందిలో 75 మంది అస్సామియా భాషలో ప్రమాణం చేశారు. ఇక 17 మంది సంస్కృతంలో ప్రమాణం చేసి చరిత్ర సృష్టించారు. బోడో, అహోం, టీ కమ్యూనిటీ, ప్లెయిన్స్ సముదాయాల నుంచి వచ్చిన నాయకులు ఈ ప్రాచీన భాషను ఎంచుకున్నారు. ఇక తొమ్మిది మంది బెంగాలీలో ఎనిమిది మంది బోడో భాషలో ప్రాణం చేశారు. రభా, కర్బి, రాజ్‌బంశీ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మిగతావారు ప్రమాణస్వీకారం చేశారు.ప్రో?టెం స్పీకర్ చంద్రమోహన్ పటోవరి ప్రమాణం చేయించగా, సీఎం హిమంత బిశ్వా సర్మా అస్సామియాలో ప్రమాణం చేశారు. రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లో లేని భాషలైన రాభా, కర్బి, రాజ్‌బంశీలను కూడా అనుమతించడం ఈ ఘటనను మరింత ప్రత్యేకం చేసింది.గతంలో భాషా ఉద్యమాలు విభజనను పెంపొందించాయి. బెంగాలీలపై అస్సామియా జాతీయవాదం, బోడోల గిరిజన హక్కుల పోరాటం ? ఇవన్నీ రాష్ట్ర స్థిరత్వానికి భంగం కలిగించాయి. కానీ ఈసారి ప్రభుత్వం (ముఖ్యంగా హిమంత సర్మా నాయకత్వం) భిన్న భాషా సముదాయాలను గౌరవించడం ద్వారా సమావేశక రాజకీయాలకు ఉదాహరణ చూపించింది. సంస్కృతం వైపు మలుపు మరింత లోతైన సందేశం ఇస్తుంది. ఇది భారతీయ సాంస్కృతిక మూలాలను గౌరవించడమే కాకుండా, వివిధ తెగల మధ్య వంతెనగా మారింది. బోడో ఎమ్మెల్యే సంస్కృతంలో ప్రమాణం చేయడం భాషా గుర్తింపు యుద్ధం నుంచి సాంస్కృతిక ఐక్యత వైపు మారిన మనస్తత్వాన్ని చూపిస్తుందిరాష్ట్రంలో 47 వరకు భాషలు మాట్లాడతారు.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com